**ప్రజలకు / పాఠకులకు ముఖ్య విజ్ఞప్తి**

"ప్రజాప్రశ్న" దినపత్రిక పేరు చెప్పుకొని ఎవరైనా డబ్బులు, విరాళాలు, ప్రకటనల పేరుతో నగదు లేదా ఇతర రూపంలో డిమాండ్ చేస్తే దయచేసి నమ్మవద్దు.

అలాంటి వ్యక్తుల వివరాలను వెంటనే మా దృష్టికి తీసుకురండి. ప్రజల ఫిర్యాదు అందిన వెంటనే సంబంధిత వ్యక్తులపై పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుంది.

- ప్రజాప్రశ్న యాజమాన్యం

PRAJA PRASHNA

# ప్రజాప్రశ్న

RNI : TELTEL/2021/80267 తెలుగు దినపత్రిక

సంపుటి: 6 సంచిక: 42, పేజీలు - 08

శుక్రవారం, ఆగష్టు 7, 2026 వెల: 5 రూ/.

హైదరాబాద్ | ప్రజల పక్షాన ప్రశ్నించే పత్రిక | HYDERABAD




# తెలంగాణ గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల సందడి

### - కాంగ్రెస్, బీజేపీ పోటీ..
### బీఆర్ఎస్ వ్యూహమేంటి?




**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** తెలంగాణ రాజకీయాల్లో మరోసారి ఎమ్మెల్సీ ఎన్నికల వేడి ప్రారంభం కాబోతోంది. హైదరాబాద్--రంగారెడ్డి--మహబూబ్‌నగర్, అలాగే వరంగల్ - ఖమ్మం - నల్గొండ పట్టభద్రుల నియోజకవర్గాల స్థానాల గడువు 2027 మార్చి నాటితో ముగియనుండటంతో, కేంద్ర ఎన్నికల సంఘం మరో రెండు మూడు నెలల్లోనే కొత్త ఓటర్ల నమోదు ప్రక్రియకు శ్రీకారం చుట్టేందుకు సమాయత్తమవుతోంది. రాజకీయ పార్టీల్లో అభ్యర్థుల ఎంపిక, ఓటర్ల నమోదు బాధ్యతలపై ముందస్తు చర్చలు జోరందుకున్నాయి. సాధారణంగా గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ పోరు అనగానే కేవలం ఓటింగ్ కాకుండా, దానికి ముందు ఓటర్లుగా పట్టభద్రులను సంతృప్తికరంగా నమోదు చేయించడమే అభ్యర్థి సగానికి పైగా గెలుపును నిర్ణయిస్తుంది. దీంతో ప్రధాన పార్టీలు రంగంలోకి దిగకముందే ఆశావహులు తమ స్థాయిలో గ్రౌండ్ వర్క్ ప్రారంభించారు.

**ఆరు నెలల ముందుగానే ఎన్నికల ప్రక్రియ**

పట్టభద్రుల నియోజకవర్గ ఎన్నికలు అసెంబ్లీ లేదా లోక్‌సభ ఎన్నికల తరహాలో ఉండవు. ప్రతి ఆరేళ్లకు ఒకసారి పాత ఓటర్ల జాబితా రద్దయి కొత్తగా ఫారం-18 ద్వారా ఓటర్లను నమోదు చేసుకోవాల్సి ఉంటుంది. ఈ క్రమంలో ఏ పార్టీ అయితే ముందుగానే తమ అభ్యర్థిని ఖరారు చేస్తుందో, ఆ నాయకుడే సొంత వ్యయంతో, నెట్‌వర్క్‌తో పట్టభద్రులతో ఫారాలు పూర్తి చేయించి ఓటర్ల నమోదు ప్రక్రియను వేగవంతం చేస్తారు. ఓటర్ల నమోదులో ఆధిక్యత సాధించిన అభ్యర్థికే ఎన్నికల్లో మొదటి ప్రాధాన్యత ఓట్లు పడే అవకాశం ఎక్కువగా ఉంటుంది. అందుకే నోటిఫికేషన్ రాకముందే టికెట్ ఆశిస్తున్న నాయకులు డిగ్రీ కళాశాలలు, ఉద్యోగుల సంఘాలు, ఐటీ కంపెనీలు, సోషల్ మీడియా ప్లాట్‌ఫారమ్‌ల వేదికగా తమ ప్రచార పర్వాన్ని ప్రారంభించేందుకు సిద్ధమవుతున్నారు.

**అధికార పార్టీలో యువనేతల పోటీ**

అధికార కాంగ్రెస్ పార్టీలో ఈసారి

2లో..

### డీలిమిటేషన్ బిల్లుపై
# యూటర్న్?

### - మారుతున్న డీఎంకే వైఖరి



**చెన్నై (ప్రశ్న న్యూస్)** కేంద్ర సర్కారు అత్యంత ప్రతిష్టాత్మకంగా భావిస్తున్న డీలిమిటేషన్, మహిళా రిజర్వేషన్ రాజ్యాంగ సవరణ బిల్లుల ఆమోదంపై పార్లమెంటులో సరికొత్త రాజకీయ సమీకరణాలు ఏర్పడుతున్నాయి. రాజ్యాంగ సవరణ బిల్లులు లోక్‌సభలో నెగ్గాలంటే మూడింట రెండొంతుల మెజారిటీ అంటే 360 మంది ఎంపీల మద్దతు తప్పనిసరి. ప్రస్తుతం అధికార ఎన్డీయే కూటమికి 326 మంది సభ్యుల బలం మాత్రమే ఉంది. అంటే కావాల్సిన మ్యాజిక్ ఫిగర్ సాధించేందుకు ఎన్డీయేకు ఇంకా 34 మంది ఎంపీల మద్దతు అవసరం. ఈ నేపథ్యంలో ప్రతిపక్ష వర్గాల్లోని 22 మంది ఎంపీల వైఖరి మారడం అధికార ఎన్డీయే కూటమికి పెద్ద ఊరటగా మారనుంది. తమిళనాడులో మారుతున్న రాజకీయ పరిస్థితులు నియోజకవర్గాల పునర్విభజన బిల్లుపై డీఎంకే వైఖరిని మారుస్తున్నట్లు కనిపిస్తోంది. రాష్ట్ర ఎన్నికలకు ముందు ఈ బిల్లును బహిరంగంగా వ్యతిరేకించిన డీఎంకే ఇప్పుడు దానిలోని నిబంధనలను సమీక్షించిన తర్వాతే మద్దతు

2లో..

### స్మార్ట్ కార్డుల పంపిణీకి
# ముహూర్తం ఫిక్స్

- ఆగస్టు 15న రేవంత్ రెడ్డి చేతుల మీదుగా పంపిణీ
- సంగారెడ్డిలో లాంఛనంగా ప్రారంభించనున్న ముఖ్యమంత్రి
- అన్ని నియోజకవర్గాల్లో ఏకకాలంలో పంపిణీ కార్యక్రమం
- డెబిట్ కార్డు సైజులో బార్‌కోడ్‌తో రానున్న కొత్త కార్డులు



**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** తెలంగాణలో కొత్త రేషన్ కార్డుల కోసం ఎదురుచూస్తున్న లక్షలాది కుటుంబాలకు రేవంత్ రెడ్డి ప్రభుత్వంశుభవార్త చెప్పింది. స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఆగస్ట్ 15వ తేదీ నుంచి రాష్ట్రవ్యాప్తంగా కొత్త తెల్ల రేషన్ కార్డుల పంపిణీ ప్రారంభించనున్నట్లు తెలంగాణ రాష్ట్ర పౌర సరఫరాల

2లో..

### సైబర్ నేరాల నియంత్రణలో
## తెలంగాణ నంబర్ 1

- పీఎంవో సమీక్షలో వెల్లడి




**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** సైబర్ నేరాల నియంత్రణలో తెలంగాణ రాష్ట్రం దేశంలోనే అగ్రస్థానంలో నిలిచింది. ప్రధానమంత్రి కార్యాలయం (పీఎంవో) 'ప్రగతి' సమీక్షలో భాగంగా దేశవ్యాప్తంగా నిర్వహించిన మూల్యాంకనంలో ఈ విషయం వెల్లడైంది. కేంద్ర హోం మంత్రిత్వ శాఖ దేశంలోని అన్ని రాష్ట్రాల సైబర్ సెక్యూరిటీ బ్యూరోల

2లో..

### ఏపీ పీపీపీ పాలసీ-2026
# ముసాయిదాకు ఆమోదం



- కేబినెట్ భేటీలో కీలక నిర్ణయాలు - మూడున్నర గంటలకు పైగా జరిగిన మంత్రివర్గ సమావేశం
- ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ యాక్ట్-2026కు గ్రీన్ సిగ్నల్

అమరావతి (ప్రశ్న న్యూస్) రాష్ట్ర సమగ్ర అభివృద్ధి, రాజధాని అమరావతి నిర్మాణంలో వేగం, పారిశ్రామిక ప్రోత్సాహకాలు తదితర అంశాలు ప్రధాన అజెండాగా ఏపీ మంత్రివర్గ సమావేశం జరిగింది. అమరావతి నిర్మాణం, పారిశ్రామికాభివృద్ధి, ప్రజా సంక్షేమమే ధ్యేయంగా మంత్రివర్గం పలు కీలక నిర్ణయాలు తీసుకుంది. ఆర్థిక వ్యవస్థకు ఊతమిచ్చే కొత్త చట్టాలతో పాటు పెండింగ్ వివాదాల పరిష్కారానికి ప్రత్యేక ప్రతిపాదనలను సిద్ధం చేసింది. విద్యా, వైద్య రంగాలు సహా రహదారి భద్రత, మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యతనిచ్చింది. సీఎం చంద్రబాబు అధ్యక్షతన జరిగిన మంత్రివర్గ సమావేశం 34 పైగా అజెండా అంశాలకు ఆమోదం తెలినట్లు సమాచార శాఖ మంత్రి కొలుసు పార్థసారథి వెల్లడించారు.

**ఆక్వా రంగానికి విద్యుత్ రాయితీ**

పారిశ్రామిక విప్లవం కోసం ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ యాక్ట్--2026, ఏపీ పీపీపీ పాలసీ-2026 ముసాయిదాలకు ఆమోదం తెలిపారు. పరిపాలనా, చట్టపరమైన సంస్కరణలలో భాగంగా ఏపీ దిశా బిల్లు-2019, ల్యాండ్ గ్రాబింగ్ బిల్లు-2024లను ఉపసంహరించి కొత్త కఠిన చట్టాలను తీసుకురావాలని నిర్ణయించారు. పారిశ్రామిక వేగానికి బల్క్‌డ్రగ్ పార్క్ కోసం హుడ్కో నుంచి 680 కోట్ల రూపాయల రుణం,

2లో..

### వైసీపీ అరాచకాలకు చెక్ పెట్టడానికి
# రెండు నిమిషాలు చాలు

- రాజకీయం ముసుగులో జగన్ నేరాలకు పాల్పడుతున్నారన్న చంద్రబాబు
- డీఎస్సీపై వైసీపీ శ్రేణులు కావాలనే వివాదాలు సృష్టిస్తున్నారని విమర్శ
- వైసీపీ దుష్ప్రచారాన్ని తిప్పికొట్టాలని కూటమి శ్రేణులకు పిలుపు



అమరావతి (ప్రశ్న న్యూస్) మాజీ సీఎం, వైసీపీ అధినేత వైఎస్ జగన్ అరాచకాలను కంట్రోల్ చేయడానికి తనకు రెండు నిమిషాలు చాలు అని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అన్నారు. వైఎస్ జగన్ పరామర్శలు అంటే జనం భయపడే పరిస్థితి వచ్చిందని విమర్శించారు. సీఎం చంద్రబాబు నాయుడు అధ్యక్షతన గురువారం రోజున సచివాలయంలో కేబినెట్ సమావేశం జరిగింది. కేబినెట్‌లో సమావేశంలో అజెండాపై చర్చ అనంతరం సీఎం చంద్రబాబు నాయుడు రాష్ట్ర మంత్రులతో చిట్‌చాట్‌గా మాట్లాడారు. ఈ క్రమంలోనే చంద్రబాబు నాయుడు కీలక వ్యాఖ్యలు చేశారు. వైఎస్ జగన్, వైసీపీ నాయకులు చేస్తున్న అరాచకాలను కంట్రోల్ చేయడానికి తనకు రెండు నిమిషాలు చాలు అని వ్యాఖ్యానించారు.

అయితే వారంతా రాజకీయ ముసుగులో నేరాలు చేస్తున్నారని సీఎం చంద్రబాబు నాయుడు ఆరోపించారు. డీఎస్సీపై వైసీపీ చేస్తున్న యాగీ కూడా అందరు

2లో..

## రేవంత్ రెడ్డి గురువు చంద్రబాబు

### - కేటీఆర్ సంచలన కామెంట్స్



**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మరోసారి తీవ్ర విమర్శలు చేశారు. సీఎం రేవంత్ రెడ్డికి పక్క రాష్ట్ర ముఖ్యమంత్రి (ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు) గురువు అని ఆరోపించారు. చంద్రబాబు చెప్పినదానికి రేవంత్ రెడ్డి వంతపాడుతున్నాడని ఆరోపణలు చేశారు. కనీసం జై తెలంగాణ అనడానికి కూడా సీఎం రేవంత్ రెడ్డికి మనసొప్పదని ఆరోపించారు. ప్రొఫెసర్ జయశంకర్ జయంతి సందర్భంగా బీఆర్ఎస్ ప్రధాన కార్యాలయం తెలంగాణ భవన్‌లో కేటీఆర్, ఇతర నేతలు ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. ఈ సందర్భంగా ఏర్పాటు

2లో..

### సింగరేణి చరిత్రలో
# సువర్ణ అధ్యాయం

### - ఒడిశా నైనీ గని నుంచి తెలంగాణకు చేరిన తొలి బొగ్గు రైలు




**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** సింగరేణి కొల్లరీస్ కంపెనీ లిమిటెడ్ చరిత్రలో మరో మైలురాయిని నమోదు చేసుకుంది. ఒడిశాలో నైనీ బొగ్గు బ్లాక్ నుంచి బయలుదేరిన తొలి బొగ్గు రైల్వే రేక్ మంచిర్యాల జిల్లా జైపూర్ సింగరేణి థర్మల్ విద్యుత్ కేంద్రం (ఎస్టీపిపి) కి విజయవంతంగా చేరుకుంది. ఇది తెలంగాణ రాష్ట్ర భద్రతలో చరిత్రాత్మక ఘట్టంగా నిలిచింది.

2లో..

# ఎస్ఐఆర్ ప్రక్రియ..
## తొలగింపు జాబితాలో 56 లక్షల మంది

### - పెండింగ్‌లో మరో 19 లక్షల మంది



**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** తెలంగాణలో జరుగుతున్న ఓటర్ జాబితా ప్రత్యేక సవరణ ప్రక్రియ (ఎస్ఐఆర్) శరవేగంగా కొనసాగుతోంది. ఈ ఎస్ఐఆర్ ప్రక్రియలో భాగంగా ఇప్పటివరకు సుమారు 56 లక్షల మంది ఓటర్లను తొలగింపు కోసం గుర్తించారు. రాష్ట్రంలోని మొత్తం 3.38 కోట్ల మంది ఓటర్లలో ఇది సుమారు 16.5 శాతం కావడం గమనార్హం. అయితే ఈ లెక్కలు ఇంకా ఫైనల్

2లో..

## డీప్‌ఫేక్‌లపై కేంద్రం ఉక్కుపాదం

### - సున్నితమైన ఫిర్యాదుల పరిష్కారానికి 2 గంటలే




న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్) సోషల్ మీడియాలో కృత్రిమ మేధ (ఏఐ) సాయంతో రూపొందుతున్న డీప్‌ఫేక్ వీడియోలు, ఆడియోలు, ఫొటోలకు అడ్డుకట్ట వేసేందుకు కేంద్ర ప్రభుత్వం నిబంధనలను మరింత కఠినతరం చేసింది. అక్రమ కంటెంట్‌పై ఫిర్యాదు అందిన మూడు గంటల్లోనే తొలగించాలని మధ్యవర్తి వేదికలకు (ఇంటర్మీడియరీలు) ఆదేశాలు జారీ చేసింది. గతంలో ఈ గడువు 36 గంటలు ఉండేది. లోక్‌సభలో కేంద్ర ఎలక్ట్రానిక్స్, ఐటీ శాఖ సహాయ మంత్రి జితిన్ ప్రసాద ఈ వివరాలు వెల్లడించారు. డీప్‌ఫేక్‌లు, ఏఐతో రూపొందించిన

2లో..

## యూపీఐపై ఛార్జీలకు లోక్‌సభ గ్రీన్ సిగ్నల్

### - వాయిస్ ఓటుతో చర్చ లేకుండానే బిల్లు పాస్




**న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్)** డిజిటల్ చెల్లింపులకు సంబంధించి కీలక మార్పులకు లోక్‌సభ ఆమోదం తెలిపింది. యూపీఐ లావాదేవీలపై ఛార్జీలు విధించే అవకాశానికి మార్గం సుగమం చేసే 'పేమెంట్ అండ్ సెటిల్‌మెంట్ సిస్టమ్స్ (సవరణ) బిల్లు-2026'ను లోక్‌సభ గురువారం మూజువాణి ఓటుతో ఆమోదించింది. ఎలాంటి చర్చ లేకుండానే బిల్లు పాస్ అయింది. ప్రస్తుతం యూపీఐ సహా కొన్ని డిజిటల్ చెల్లింపులపై బ్యాంకులు, చెల్లింపు సేవల సంస్థలు మర్చంట్ డిస్కౌంట్ రేటు (ఎండీఆర్) వసూలు చేయకుండా చట్టపరమైన నిబంధన ఉంది. తాజా సవరణతో ఆ నిబంధన తొలగనుంది. దీంతో భవిష్యత్‌లో బ్యాంకులు, ఫిన్‌టెక్ సంస్థలు

2లో..

# తెలంగాణ గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల సందడి

అభ్యర్థుల పోటీ తీవ్రంగా ఉంది. సామ రామ్మోహన్ రెడ్డి వంటి యువ నేతలు పోటీకి రెడీ అవుతున్నారు. మరోవైపు, ఉపఎన్నికలో గెలిచిన తీన్మార్ మల్లన్న మళ్లీ పోటీకి ఇప్పటినుంచే ప్రణాళికలు సిద్ధం చేసుకుంటున్నారు. తన సోషల్ మీడియా నెట్‌వర్క్, గ్రాడ్యుయేట్ గ్రూపులతో పాటు గతంలో సంపాదించిన ఓటు బ్యాంకును నిలబెట్టుకోవడానికి ఆయన క్షేత్రస్థాయిలో కసరత్తు మొదలుపెట్టారు. మరోవైపు భారతీయ జనతా పార్టీ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలను అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకుంటోంది. పట్టభద్రులు, పట్టణ ప్రాంత విద్యావంతులు, ఉద్యోగులు సాంప్రదాయకంగా తమకే అనుకూలంగా ఉంటారనేది బీజేపీ నమ్మకం. హైదరాబాద్ – రంగారెడ్డి – మహబూబ్‌నగర్ స్థానంలో గతంలో ఎన్. రామచందర్‌రావు విజయం సాధించిన చరిత్ర ఉండటంతో, ఈ సీటును తిరిగి కైవసం చేసుకోవాలని కమలం పార్టీ పట్టుదలతో ఉంది. సీనియర్ నాయకులతో పాటు యువ మోర్చా, విద్యార్థి సంఘాల రికార్డు ఉన్న నాయకులు ఈ సీటు నుంచి పోటీ చేసేందుకు ఆసక్తి చూపుతున్నారు. బీజేపీ సైతం ఓటర్ల నమోదు ప్రారంభమయ్యే నాటికే అధికారికంగా లేదా సూచనప్రాయంగా అభ్యర్థులను ప్రకటించి ఫీల్డ్‌లోకి దించాలని భావిస్తోంది.

### బీఆర్ఎస్‌లో పెద్దగా కనిపించని సందడి

ఈ మొత్తం సమీకరణాల్లో బీఆర్ఎస్ పార్టీ వైఖరి ఇప్పుడు ఆసక్తికరంగా మారింది. శాసనసభ, లోక్‌సభ ఎన్నికల అనంతరం గులాబీ పార్టీ తీవ్ర సవాళ్లను ఎదుర్కొంటోంది. అయితే పట్టభద్రుల ఓటర్లలో మళ్లీ పట్టు సాధించకపోతే అర్బన్ ఓటర్లలో పార్టీ ప్రభావం తగ్గిపోతుందనే ఆందోళన బీఆర్ఎస్ అధిష్టానంలో ఉంది. మరి బీఆర్ఎస్ తరఫున పోటీ ఉంటుందా లేదా అంటే కచ్చితంగా అభ్యర్థులను నిలబెట్టక తప్పని పరిస్థితి. అయితే అధికార కాంగ్రెస్, దూకుడు మీదున్న బీజేపీని తట్టుకుని, ఆర్థికంగా, యంత్రాంగ పరంగా ఓటర్ల నమోదు ప్రక్రియను భుజాన వేసుకునే బలమైన అభ్యర్థిని వెతకడమే బీఆర్ఎస్‌కు పెద్ద పరీక్షగా మారింది. వాట్సాప్ గ్రూపులు, యూట్యూబ్ ఛానెళ్లు, ఫేస్‌బుక్ ఐటీ కమ్యూనిటీలలో ఇప్పటికే ఓటర్ల నమోదు అవగాహన ప్రచారాలు మొదలయ్యాయి. నిరుద్యోగ భృతి, జాబ్ క్యాలెండర్, ఉద్యోగుల పీఆర్సీ, పెన్షన్ సవరణలు వంటి అంశాలు ప్రధాన ఎన్నికల అజెండాగా మారనున్నాయి. ప్రభుత్వ ఉద్యోగులు, ప్రైవేటు రంగానికి చెందిన నిరుద్యోగ పట్టభద్రులు ఎటువైపు మొగ్గు చూపుతారనే అంశం గెలుపోటముల్ని నిర్ణయించనుంది.

### ప్రభుత్వంపై విద్యావంతుల అభిప్రాయం తెలిసే అవకాశం

రాబోయే మార్చి నాటికి ముగిసే ఈ రెండు గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికలు రాష్ట్ర రాజకీయాల్లో ప్రాధాన్యత సంతరించుకున్నాయి. ఈ ఎన్నికలు కేవలం ఇద్దరు ఎమ్మెల్సీలను ఎన్నుకోవడమే కాకుండా, రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ పాలనపై పట్టభద్రుల తీర్పుగా, బీజేపీ అర్బన్ ఇమేజ్‌కు సవాలుగా, అలాగే బీఆర్ఎస్ పుంజుకునేందుకు లభించే అవకాశంగా మారనున్నాయి. ఓటర్ల నమోదు నాటికే అభ్యర్థులను ఖరారు చేసి వ్యూహాత్మకంగా అడుగులు వేసే పార్టీకే విజయావకాశాలు మెండుగా ఉంటాయని అనుకోవచ్చు.

# డీలిమిటేషన్ బిల్లుపై యూటర్న్..?

ఇవ్వాలా వద్దా అనే దానిపై నిర్ణయం తీసుకుంటామని చెబుతోంది. రాష్ట్రాల్లోని ప్రస్తుత శాసనసభ సీట్లను సమానంగా 50 శాతం పెంచాలనే నిబంధనను బిల్లులో చేర్చితే ఆ బిల్లుకు మద్దతు ఇచ్చేందుకు తాము సిద్ధంగా ఉన్నామని డీఎంకే వర్గాలు సంకేతాలు ఇస్తున్నాయి. ఏప్రిల్‌లో ప్రవేశపెట్టిన ప్రభుత్వ బిల్లులో ఈ విషయాన్ని ప్రస్తావించినప్పటికీ దానిని బిల్లులో చేర్చలేదు. ఆ బిల్లు ఆమోదం పొందలేదు. గత సమావేశాల్లో ప్రభుత్వం ఈ బిల్లును ప్రవేశపెట్టినప్పుడు, ఇది తమిళనాడు ప్రయోజనాలకు వ్యతిరేకమని పేర్కొంటూ డీఎంకే బహిరంగంగా వ్యతిరేకించింది. ఆ సమయంలో బిల్లులోని నిబంధనలపై ఎలాంటి చర్చ జరగలేదు. డీఎంకే ఒత్తిడితోనే ఇండియా కూటమి ఈ బిల్లును వ్యతిరేకించిందని పలు వర్గాలు చెబుతున్నాయి. స్థానిక సంస్థలలో మహిళలకు 50 శాతం రిజర్వేషన్ కల్పించే బిల్లును కాంగ్రెస్ పార్టీ వ్యతిరేకిస్తుందని ప్రభుత్వం కూడా ఊహించలేదు. గతంలో ఉన్న వైఖరి ఇప్పుడు లేదని సీనియర్ డీఎంకే నాయకుడు తిరుచి శివ అన్నారు. ముందుగా బిల్లు ముసాయిదాను ప్రవేశపెట్టాలని, ఆ తర్వాతే తాము నిర్ణయం తీసుకుంటామని ఇప్పుడు చెబుతున్నామని ఆయన తెలిపారు. లోక్‌సభలో డీఎంకేకు 22 మంది సభ్యులు ఉన్నారు. ఈ బిల్లును మూడింట రెండు వంతుల మెజారిటీతో ఆమోదింపజేసుకోవడంలో ఇది ప్రభుత్వానికి కీలకంగా మారవచ్చు. ఈ బిల్లును ఆమోదింపజేసుకోవడానికి ప్రభుత్వానికి లోక్‌సభలో 360 మంది ఎంపీల మద్దతు అవసరం. ప్రస్తుతం ఎన్డీఏకు 326 మంది సభ్యులు ఉన్నారు. టీవీకే ప్రభుత్వానికి కాంగ్రెస్ మద్దతు ఇవ్వడంపై ఆగ్రహంతో డీఎంకే గతంలో ఇండియా కూటమి నుంచి వైదొలగిన విషయం గమనార్హం. ఈ పరిణామం అధికార ఎన్డీయే ఆశలను పెంచింది.

### ప్రత్యేక పార్లమెంట్ సమావేశాలపై కేంద్రం స్పష్టత

మరోవైపు మహిళా రిజర్వేషన్, డీలిమిటేషన్ బిల్లులను ఆమోదింపజేసుకోవడానికి స్వాతంత్ర్య దినోత్సవం తర్వాత ఆగస్టు 16 నుంచి 18 మధ్య పార్లమెంటు ప్రత్యేక సమావేశాలు నిర్వహించనున్నట్లు వస్తున్న కథనాలను పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజు బుధవారం రాత్రి ఖండించారు. ప్రస్తుతం జరుగుతున్న వర్షాకాల సమావేశాల్లోనే ఈ రాజ్యాంగ సవరణ బిల్లును ఆమోదింపజేసేందుకు ప్రభుత్వం మరోసారి ప్రయత్నిస్తోంది. 2029 లోక్‌సభ ఎన్నికల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్ కల్పించడం, లోక్‌సభ సీట్ల సంఖ్యను 816కు పెంచడం ఈ బిల్లుల లక్ష్యం.

# రాష్ట్ర మన్యం బంద్ జయప్రదం చేయండి

**- హైడ్రో పవర్ ప్రాజెక్ట్ జారీ చేసిన జీవోలు 13, 51 ,29, రద్దు చేయాలి.**

**- ఆదివాసి గిరిజన సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పొద్దు బాలదేవ్**



**అరకులోయ** రాష్ట్ర ముఖ్యమంత్రి హామీ అమలు చేస్తూ ఆదివాసులకు నూరు శాతం రిజర్వేషన్ జీఓ నెంబర్ – 3 కు ప్రత్యామ్నాయ జీఓ ఆర్డినెన్స్ జారీ చేయాలని 1/70 చట్టం పరిరక్షణకు రాష్ట్ర ప్రభుత్వం సుప్రీంకోర్టులో కౌంటర్ పిటిషన్ దాఖలు చేయాలని హైడ్రో పవర్ ప్రాజెక్ట్ అక్రమ ఒప్పందాలు జారీ చేసిన జీవోలు 13 ,51 ,29 ,2 రద్దు చేయాలని ఆగస్టు 8న రాష్ట్ర మన్యం బంద్ ఆదివాసి ప్రజానికమంతా పాల్గొని విజయవంతం చేయాలని ఆదివాసి గిరిజన సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పొద్దు బాలాదేవ్ పిలుపునిచ్చారు. అల్లూరి సీతారామరాజు జిల్లా అరకులోయ మండలం లోతేరు పంచాయతీలో కె స్వామి అధ్యక్షతన జరిగిన సభలో ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పొద్దు బాలదేవ్ మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి ఆదివాసులకు ఇచ్చిన హామీ నూరు శాతం ఉద్యోగ ఉపాధ్యాయ నియామక రిజర్వేషన్ జీఓ నెంబర్ 3 కు ప్రత్యేక జీఓ ఆర్డినెన్స్ జారీ చేయాలని హామీ ఇచ్చి రెండు సంవత్సరాలు గడిచిందని రాష్ట్ర ప్రభుత్వం హైపవర్ కమిటీ పేరుతో కాలయాపన చేస్తుందని ఆగస్టు 9 ప్రపంచ ఆదివాసి దినోత్సవం రోజు రాష్ట్ర ముఖ్యమంత్రి ఆదివాసులకు 100% రిజర్వేషన్ ఆర్డినెన్స్ జారీచేసి ఆరు నెలల్లో చట్టం చేయాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం హైడ్రో పవర్ ప్రాజెక్ట్ ఏకపక్షంగా బడా కార్పొరేట్ నవయుగ ఆదాని శిరిడి సాయి ఎలక్ట్రికల్ కన్స్ట్రక్షన్ మెగా కంపెనీలతో అక్రమ ఒప్పందాలు చేసుకొని జారీచేసిన జీవోలు 13 51 29 2 తక్షణమే రద్దు చేయాలని హైడ్రో పవర్ ప్రాజెక్ట్ పేరుతో ఆదివాసులకు జల సమాధి చేయొద్దని హైడ్రో పవర్ ప్రాజెక్ట్ ప్రభావిత ప్రాంతంలో అక్రమ సర్వేలు డ్రోన్లు ఎగురుతున్న వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఆదివాసి సామాజిక ఉద్యమకారులపై ప్రభుత్వం పోలీసుల అక్రమ నిర్బంధాలు అక్రమ కేసులు పెట్టి భయభ్రాంతులు గురి చేయడం తగదన్నారు. 1/70 చట్టం సవరణ చేయాలని ఐదో షెడ్యూల్ భూభాగంలో భూమి హక్కు కావాలని గిరిజనేతరులు 1672 మంది సుప్రీంకోర్టులో పిటిషన్ రకాలు చేశారని ఇది ఆదివాసుల హక్కులు చట్టాలు నిర్వీర్యం చేసేందుకు కుట్రలో భాగమని రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే సుప్రీంకోర్టులో 1/70 చట్టం పరిరక్షణకు కౌంటర్ పిటిషన్ దాఖలు చేయాలని అల్లూరి సీతారామరాజు జిల్లాలో జూన్–1 లో కొనసాగిస్తూ విడుదల చేయాలని డిమాండ్ చేశారు ఈ కార్యక్రమంలో అరకులోయ మండలం పెసా ఫోరం నాయకులు ఎం రమేష్ కె రామన్న కే స్వామి బలరాం భీమా మోహన్ నరసింగరావు ఆదివాసి గిరిజన సంఘం నాయకులు రమేష్ గెన్ను రామ్ చందర్ బాబురావు మంగలయ్య లోతర్ పంచాయితీ నాయకులు కిలో నోబో శెట్టి మధు చందోర్ సోనాపతి రాజు జగనధం అధిక సంఖ్యలో ఆదివాసులు మహిళలు పాల్గొన్నారు.

# సైబర్ నేరాల నియంత్రణలో తెలంగాణ నంబర్ 1

పనితీరును తొమ్మిది కీలక పారామితుల ఆధారంగా విశ్లేషించి ఈ ర్యాంకును ఖరారు చేసింది. స్టేట్ సైబర్ క్రైమ్ కోఆర్డినేషన్ సెంటర్ (ఎస్4సీ) ఏర్పాటు, ఇ–జీరో ఎఫ్ఐఆర్ అమలు, గ్రీవెన్స్ రిడ్రెస్సల్ మాడ్యూల్, బాధితులకు తిరిగి నగదు ఇప్పించేందుకు మనీ రిస్టోరేషన్ మాడ్యూల్ వినియోగం, సహ్యోగ్–సమన్వయ పోర్టళ్ల వాడకం, సైబర్ క్రైమ్ హాట్‌స్పాట్‌ల పర్యవేక్షణ, సామర్థ్య పెంపుదల వంటి కార్యక్రమాల్లో కనబరిచిన అత్యుత్తమ పనితీరు ఆధారంగా తెలంగాణ ఈ ప్రథమ స్థానాన్ని కైవసం చేసుకుంది. దేశంలోనే తొలిసారిగా ఎస్4సీ కేంద్రాన్ని ఏర్పాటు చేయడంతో పాటు, ఇండియన్ సైబర్ క్రైమ్ కోఆర్డినేషన్ సెంటర్ పరిధిలోని కేంద్ర వేదికలను అత్యంత సమర్థవంతంగా వినియోగించుకుంటున్నందుకు తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో ప్రత్యేక ప్రశంసలు అందుకుంది. ప్రజలు ఎలాంటి సైబర్ మోసానికి గురైనా వెంటనే 1930 నంబర్‌కు డయల్ చేయాలని లేదా నేషనల్ సైబర్ క్రైమ్ రిపోర్టింగ్ పోర్టల్‌లో ఫిర్యాదు చేయాలని టీజీసీఎస్‌బీ సూచించింది. ఫిర్యాదుల పరిష్కారం, నష్టపోయిన డబ్బును తిరిగి పొందడంలో బాధితులకు సహాయం చేసేందుకు ప్రత్యేకంగా 87126 65600 అనే హెల్ప్‌లైన్ నంబర్‌ను కూడా అందుబాటులోకి తెచ్చినట్లు వెల్లడించింది. పోలీసింగ్‌లో ఆధునిక సాంకేతికతను అందిపుచ్చుకోవడం, సైబర్ బాధితులకు వేగంగా అండగా నిలవడం వంటి నిరంతర చర్యలే తెలంగాణకు ఈ ఘనతను సాధించిపెట్టాయి.

# స్మార్ట్ కార్డుల పంపిణీకి ముహూర్తం ఫిక్స్

శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ప్రకటించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతుల మీదుగా సంగారెడ్డి జిల్లాలో ఈ కార్యక్రమాన్ని లాంఛనంగా ప్రారంభించనుండగా అదే రోజు రాష్ట్రంలోని 119 అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఒకేసారి స్మార్ట్ కార్డుల పంపిణీ చేపట్టనున్నట్లు తెలిపారు. అర్హులైన ప్రతి పేద కుటుంబానికి రాష్ట్ర ప్రభుత్వం ఆహార భద్రతను మరింత బలోపేతం చేయాలనే లక్ష్యంతో ఈ కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తోంది. ఈ విడతలో రాష్ట్రవ్యాప్తంగా సుమారు 1.05 కోట్ల మంది లబ్ధిదారులకు కొత్త స్మార్ట్ రేషన్ కార్డులను అందించనున్నారు. ఇప్పటివరకు ఆన్‌లైన్‌లో కార్డులు మంజూరైనా భౌతికంగా కార్డులు అందని కుటుంబాలకు కూడా ఈ పంపిణీ ద్వారా ఉపశమనం లభించనుందని అధికారిక వర్గాలు వెల్లడించాయి. ఈసారి పంపిణీ చేసే రేషన్ కార్డులను ఆధునిక టెక్నాలజీతో రూపొందించారు. పీవీసీ మెటీరియల్‌తో తయారు చేసిన లామినేటెడ్ స్మార్ట్ కార్డులపై క్యూఆర్ కోడ్‌తో పాటు భద్రతా ఫీచర్లను ఏర్పాటు చేశారు. వాటర్‌ప్రూఫ్‌గా, క్రెడిట్ కార్డు పరిమాణంలో ఉండే ఈ స్మార్ట్ కార్డులు ఎక్కువ కాలం ఉపయోగపడేలా తయారు చేశారు. ఈ స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం జిల్లా యంత్రాంగానికి ఇప్పటికే ఆదేశాలు జారీ చేసింది. రేషన్ లబ్ధిదారుల తుది జాబితాల పరిశీలన, ఈ–కేవైసీ పూర్తి చేయడం, కార్డుల ముద్రణ, రవాణా, పంపిణీ కేంద్రాల ఏర్పాటు వంటి అన్ని ఏర్పాట్లను సమగ్రంగా పూర్తి చేయాలని అధికారులకు కీలక సూచనలు చేశారు. ప్రతి నియోజకవర్గంలో రెవెన్యూ అధికారులు, జిల్లా కలెక్టర్లు స్థానిక ప్రజాప్రతినిధులతో సమన్వయం చేసుకుని ఈ కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. రాష్ట్రంలో ఉన్న పేద కుటుంబాలకు ఆహార భద్రతను కల్పించడంతో పాటు ప్రభుత్వం నుంచి వచ్చే సంక్షేమ పథకాల ప్రయోజనాలు అర్హులందరికీ చేరేలా చూడడమే ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు. రేషన్ కార్డుల పంపిణీ రాష్ట్ర సంక్షేమ పాలనలో మరో కీలక మైలురాయిగా నిలుస్తుందని రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఆశాభావం వ్యక్తం చేస్తోంది.

# డీప్‌ఫేక్‌లపై కేంద్రం ఉక్కుపాదం

తప్పుడు సమాచారం పెరుగుతున్న నేపథ్యంలో ఐటీ నిబంధనలను బలోపేతం చేసినట్లు చెప్పారు. నగ్న చిత్రాలు, వ్యక్తుల వేషధారణను అనుకరించడం, అశ్లీల కంటెంట్ వంటి సున్నితమైన అంశాలపై వచ్చే ఫిర్యాదులను ఇకపై రెండు గంటల్లోనే పరిష్కరించాలని స్పష్టం చేశారు. గతంలో ఇందుకు 24 గంటల గడువు ఉండేది. ఏఐతో రూపొందించిన కంటెంట్‌కు స్పష్టమైన గుర్తింపు, సోర్స్ వివరాలు తప్పనిసరిగా ఉండేలా చర్యలు తీసుకోవాలని సోషల్ మీడియా వేదికలను కేంద్రం ఆదేశించింది. దీంతో వినియోగదారులు అది నిజమైనదా, కృత్రిమంగా రూపొందించిందా అనేది సులభంగా గుర్తించే అవకాశం ఉంటుంది. చట్టాలను ఉల్లంఘించే డీప్‌ఫేక్ కంటెంట్ తయారీ, ప్రచారాన్ని అడ్డుకునేందుకు ఆటోమేటెడ్ సాంకేతిక వ్యవస్థలను వినియోగించాలని కూడా సూచించింది. బాలల లైంగిక దోపిడీ, అనుమతి లేకుండా వ్యక్తిగత చిత్రాల ప్రచారం, వేషధారణ మోసాల వంటి కంటెంట్‌పై వెంటనే చర్యలు తీసుకోవాలని స్పష్టం చేసింది. డీప్‌ఫేక్‌లను గుర్తించేందుకు ఐఐటీ జోధ్‌పూర్, ఐఐటీ మద్రాస్, ఐఐటీ ఖరగ్‌పూర్ అభివృద్ధి చేసిన ప్రత్యేక వ్యవస్థలను కూడా కేంద్రం ప్రస్తావించింది. అలాగే ఫిర్యాదుల పరిష్కారం కోసం గ్రీవెన్స్ అధికారుల నియామకం, కేంద్ర స్థాయిలో అప్పీల్ వ్యవస్థ, 'సహయోగ్' పోర్టల్‌ను కూడా అందుబాటులో ఉంచినట్లు తెలిపింది.

## ఏపీ పీపీపీ పాలసీ-2026

# ముసాయిదాకు ఆమోదం

ఆక్వా రంగానికి యూనిట్‌కు రూపాయిన్నర విద్యుత్ రాయితీని కొనసాగించనున్నారు. అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీల పునర్వ్యవస్థీకరణతో పాటు మున్సిపల్ భూముల లీజు గడువును 25ఏళ్లకు పైగా పెంచేలా చట్టసవరణలకు ఆమోదం తెలిపారు. రాజధాని అమరావతి నిర్మాణం, పారిశ్రామికాభివృద్ధే లక్ష్యంగా రాష్ట్ర మంత్రివర్గం కీలక నిర్ణయాలు తీసుకుంది. సీఎం చంద్రబాబు అధ్యక్షతన జరిగిన భేటీలో 34 అజెండా అంశాలకు పచ్చజెండా ఊపింది. ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ యాక్ట్--2026, ఏపీ పీపీపీ పాలసీ–2026 ముసాయిదాలను ఆమోదించింది. ఏపీ దిశా బిల్లు–2019, ల్యాండ్ గ్రాబింగ్ బిల్లు–2024లను ఉపసంహరించి, కొత్త కఠిన చట్టాలను తీసుకురావాలని నిర్ణయించింది. విశాఖ వెలంపేట మురికివాడ పేదలకు 28కోట్ల 44 లక్షలతో బహుళ అంతస్తుల భవనాలను మంజూరుకు క్యాబినెట్ ఆమోదం తెలిపింది.

### స్లమ్ పేదలకు ఇళ్లు

రాజధాని అమరావతి పునర్నిర్మాణంలో భాగంగా అమరావతి క్వాంటమ్ వ్యాలీ ట్విన్ టవర్స్ పనులను వేయి కోట్ల రూపాయలతో ఎల్ అండ్ టీ సంస్థకు అప్పగించి రుణం సమీకరించేందుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. అసెంబ్లీ, హైకోర్టు అదనపు డిజైన్ల వ్యయాన్ని 206 కోట్లకు పెంచుతూ సవరించిన అనుమతులు మంజూరు చేశారు. రైతుల యాన్యుటీ చెల్లింపుల కోసం తీసుకున్న 300 కోట్ల రుణానికి, 'అమరావతి ఐ' ప్రాజెక్టు రీ–టెండర్లకు పచ్చజెండా ఊపారు. వైకుంఠపురం ఇనాం భూముల వివాదాన్ని 122 కోట్ల రూపాయల పరిహారంతో శాశ్వతంగా పరిష్కరించేలా నిర్ణయం తీసుకున్నారు. కుప్పం ఎయిర్‌పోర్ట్ బాధితులకు ఎకరాకు 12 లక్షల 44వేల రూపాయల పరిహారం, విశాఖ వెలంపేట స్లమ్ పేదలకు 28కోట్ల 44 లక్షలతో బహుళ అంతస్తుల భవనాలను మంజూరు చేసేందుకు క్యాబినెట్ ఆమోదం తెలిపింది.

### ఘాట్ల అభివృద్ధికి నిధులు

పాదచారుల భద్రతా పాలసీ–2026 అమల్లోకి తెస్తూ మంత్రివర్గం ఆమోదం తెలిపింది. గోదావరి పుష్కరాలు– 2027 ఘాట్‌ల అభివృద్ధికి 210 కోట్ల రూపాయలు కేటాయించేందుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. విద్యా వ్యవస్థ విస్తరణలో భాగంగా ఆర్వీఎస్, ప్రగతి ప్రైవేట్ యూనివర్సిటీలతో పాటు కొత్త జిల్లాలకు 15 కొత్త డీఈవో పోస్టులను మంత్రివర్గం ఆమోదించింది.

# యూపీఐపై ఛార్జీలకు లోక్‌సభ గ్రీన్ సిగ్నల్




యూపీఐ లావాదేవీలపై ఛార్జీలు విధించే అవకాశం ఏర్పడింది. ప్రస్తుతం ఆర్‌టీజీఎస్, నెఫ్ట్ లావాదేవీలపై సేవా రుసుములు అమల్లో ఉండగా, యూపీఐకి మాత్రం మినహాయింపు ఉంది. కొత్త బిల్లుతో ఆ పరిస్థితి మారనుంది. అయితే ఈ ఛార్జీలు సాధారణ వినియోగదారులపై కాదు. నిర్దిష్ట పరిమితికి మించిన యూపీఐ లావాదేవీలు చేసే పెద్ద వ్యాపారులు, వ్యాపార సంస్థలకే వర్తించే అవకాశం ఉందని సమాచారం. డిజిటల్ చెల్లింపు వ్యవస్థను నిర్వహిస్తున్న బ్యాంకులు, చెల్లింపు సేవల సంస్థలు, మౌలిక సదుపాయాల సంస్థలకు ఆదాయం సమకూర్చడమే ఈ మార్పుల ప్రధాన ఉద్దేశంగా తెలుస్తోంది. ఛార్జీల శాతం, ఏ స్థాయి లావాదేవీలకు వర్తిస్తాయనే అంశాలపై కేంద్ర ప్రభుత్వం, నియంత్రణ సంస్థలు తర్వాత స్పష్టత ఇవ్వనున్నాయి.

# సింగరేణి చరిత్రలో సువర్ణ అధ్యాయం

ఈ తొలి రేక్ లో 59 బాక్స్ వ్యాగన్లు ఉన్నాయి. వీటిలో సుమారు 4 వేలు టన్నుల అత్యుత్తమ జీ–10 గ్రేడ్ బొగ్గు ఉంది. ఒడిశా నుంచి 1131 కిలోమీటర్ల దూరం ప్రయాణించి జైపూర్ ఎస్టీపిపికి చేరుకుంది. ఈ సందర్భంగా సింగరేణి డైరెక్టర్లు ఎల్.వి.సూర్యనారాయణ, ఎం.తిరుమల రావు రేక్ కు ఘన స్వాగతం పలికారు. ప్రత్యేక పూజలు నిర్వహించి అన్ లోడింగ్ ప్రక్రియ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎస్టీపిపి ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్, జనరల్ మేనేజర్, గుర్తింపు పొందిన , ప్రాతినిధ్య కార్మిక సంఘాల నాయకులు, అధికార సంఘ ప్రతినిధులు, ఉద్యోగులు, కార్మికులు పాల్గొన్నారు. ఈ చారిత్రాత్మక ఘట్టం సందర్భంగా సింగరేణి యాజమాన్యానికి అధికారులకు, ఉద్యోగులకు శుభాకాంక్షలు తెలియజేశారు ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు. సింగరేణి థర్మల్ పవర్ ప్రాజెక్ట్ కోసం కేటాయించిన నైనీ బొగ్గు బ్లాక్ నుంచి తొలి రైల్ రేక్ రావడం మనందరికీ గర్వకారణం అన్నారు మల్లు భట్టి విక్రమార్క. సింగరేణి చరిత్రలో ఇది చారిత్రక ఘట్టం అన్నారు. తెలంగాణ విద్యుత్ అవసరాలు తీర్చడంలో, రాష్ట్ర అభివృద్ధిలో సింగరేణి పాత్ర ఎనలేనిది అని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో ప్రభుత్వం సింగరేణిని మరింత బలోపేతం చేస్తూ, ప్రపంచ స్థాయి సంస్థగా తీర్చిదిద్దే లక్ష్యంతో ముందుకు సాగుతోందని స్పష్టం చేశారు. నైనీ బొగ్గు బ్లాక్ ను 2015లో కేంద్ర బొగ్గు మంత్రిత్వ శాఖ సింగరేణికి కేటాయించింది. దాదాపు తొమ్మిదేళ్లు నిలిచిపోయిన ఈ ప్రాజెక్టును ప్రస్తుత ప్రభుత్వం వేగవంతం చేసింది. 2025 ఏప్రిల్ 16న నైనీ గనిలో బొగ్గు ఉత్పత్తి అధికారికంగా ప్రారంభమైంది. ఈ బ్లాక్ లో 340.78 మిలియన్ టన్నుల బొగ్గు నిల్వలు ఉన్నాయి. ఏడాదికి కోటి టన్నుల ఉత్పత్తి సామర్థ్యం, 36ఏళ్ల గని జీవితకాలం ఉంది. నాణ్యమైన జీ 10 గ్రేడ్ బొగ్గు ఎస్టీపిపికి నిరంతర సరఫరా అందించడంలో రాష్ట్ర విద్యుత్ ఉత్పత్తికి దీర్ఘకాలిక స్థిరత్వం లభించనుంది. సింగరేణి అధికారులు ఈ విజయాన్ని సంస్థ విస్తరణలో కొత్త అధ్యాయంగా అభివర్ణించారు. ఇతర రాష్ట్రాల్లో మైనింగ్ కార్యకలాపాలు ప్రారంభించడం ద్వారా జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ఎదరగడానికి ఇది మొదటి అడుగు అని పేర్కొన్నారు. నైనీ బొగ్గు సరఫరాతో ఎస్టీపిపి ఇందన భద్రత పెరగడమే కాకుండా, రాష్ట్ర విద్యుత్ రంగం మరింత బలపడనుంది. ఈ చారిత్రక ఘట్టం సింగరేణి ఉద్యోగులు, కార్మికుల కృషికి నిదర్శనం. తెలంగాణ ప్రభుత్వం, సింగరేణి యాజమాన్యం సమన్వయంతో మరిన్ని అభివృద్ధి పథకాలు ముందుకు సాగనున్నాయని అన్నారు ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు.


# రేవంత్ రెడ్డి గురువు చంద్రబాబు

చేసిన కార్యక్రమంలో కేటీఆర్ మాట్లాడుతూ నీళ్లు, నిధులు, నియామకాలు పుష్కలంగా ఉన్న రాష్ట్ర తెలంగాణ అని అన్నారు. "నీళ్లు పుష్కలంగా ఉన్నాయి. కానీ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాలమూరు పంపులు, కన్నెపల్లి పంపులు ఆన్ చేయరు. మనకేమో గురువు ప్రొఫెసర్ జయశంకర్ ఆయనకేమో గురువు పక్క రాష్ట్ర ముఖ్యమంత్రి. పక్క రాష్ట్ర ముఖ్యమంత్రి ఏం చెబితే దానికి వంత పాడటం తప్ప రేవంత్ రెడ్డికి ఇంకొకటి తెలియదు. జై తెలంగాణ అనేందుకు కూడా రేవంత్ రెడ్డికి మనసొప్పదు ఇలాంటి ముఖ్యమంత్రి ఉండటం బాధకరం. నిధులను మొత్తం ఢిల్లీకి పంపుతున్నారు. పైగా తెలంగాణ దివాళా తీసిందని దిక్కుమాలిన మాటలు మాట్లాడుతున్నారు. అందుకే జయశంకర్ మళ్లీ ఒకసారి బ్రతికొచ్చి రేవంత్ రెడ్డి వంటికి పాఠాలు చెబితే బాగుండని అనిపిస్తుంది" అని కేటీఆర్ అన్నారు. రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రి అయిన తర్వాత 75 సార్లు ఢిల్లీ వెళ్లాడని సగటు 13 రోజులకోసారి ఢిల్లీ పోతాడని దేహి దేహీ అని ఈ రోజు అక్కడ యాచిస్తున్నాడని కేటీఆర్ ఆరోపించారు. ఢిల్లీ వాళ్లను యాచించి, వాళ్ల ముందు గులాంగిరీ చేస్తున్నాడని అన్నారు. అందుకే ఢిల్లీకి సామంతులుగా ఉండొద్దని జయశంకర్ చెప్పారని స్వతంత్రులుగా ఉండాలే అని ఆయన కోరుకున్నారని అన్నారు. తెలంగాణను సాధించిన జాతిపితగా, ఫాదర్ ఆఫ్ తెలంగాణ కేసీఆర్‌ను చూస్తున్నామని అన్నారు. కేసీఆర్ ఆనాడూ ఆయనకు గాడ్ ఫాదర్‌గా ప్రొఫెసర్ జయశంకర్‌ను భావించారని చెప్పారు. కాంగ్రెస్‌లో కలవొద్దని ప్రొఫెసర్ జయశంకర్ చెప్పారని కేటీఆర్ అన్నారు. "ఎన్నటికైనా స్వీయ రాజకీయ అస్థిత్వమే తెలంగాణకు శ్రీరామ రక్ష. తెలంగాణ కోసం ఒక స్వీయ రాజకీయ అస్థిత్వ పతకా ఉండాలే. ఎన్నటికైనా తెలంగాణ కోసం ఎలాంటి రాజీ లేకుండా ఎవరితో కాంప్రమైజ్ కాకుండా గొంతు విప్పితే ఒక సింహం లాగా గర్జించే విధంగా కేసీఆర్ తీరుగా గొంతు ఉండాలే అందుకే కాంగ్రెస్‌లో కలవొద్దు అని గట్టిగా వాదించిన నాయకుడు, మహానుభావుడు ప్రొఫెసర్ జయశంకర్" అని కేటీఆర్ అన్నారు. అయితే ఇప్పుడు ఢిల్లీ పార్టీల చేతిలో తెలంగాణ మళ్ళీ తల్లడిల్లుతోందని కేటీఆర్ అన్నారు. తెలంగాణ కోసమే పుట్టిన పార్టీ బీఆర్ఎస్ అని చెప్పారు. పార్లమెంట్‌లో బీజేపీ ఎంపీ లేచి తెలంగాణ ఏర్పాటును, పాకిస్తాన్ ఏర్పాటుతో పోలిస్తే రాష్ట్రం నుంచి ఎంపీలుగా ఉన్న కాంగ్రెస్, బీజేపీ నేతలు ఒక్క మాటైనా మాట్లాడారా.? అని ప్రశ్నించారు. అదే బీఆర్ఎస్ ఎంపీలు లోక్‌సభలో ఉంటే ఆ పరిస్థితి ఉంటుండెనా.? అని అడిగారు.

# వైసీపీ అరాచకాలకు చెక్ పెట్టడానికి రెండు నిమిషాలు చాలు

గమనిస్తున్నారని అన్నారు. ప్రభుత్వం ఇప్పటికే డీఎస్సీపై ప్రజలకు వివరించిందని చెప్పారు. వైసీపీ వాళ్లు కోర్టులకు వెళితే అక్కడ కూడా చీవాట్లు పెట్టారని అన్నారు. అయినప్పటికీ డీఎస్సీపై వైసీపీ నేతలు నానా యాగీ చేస్తున్నారని మండిపడ్డారు. వైసీపీ చేస్తున్న ఈ తప్పుడు ప్రచారాన్ని కూటమి నేతలు ఎక్కడికక్కడ తిప్పికొట్టాలని సీఎం చంద్రబాబు ఆదేశించారు. డీఎస్సీకి ఎంపికైనవారు ఉద్యోగాలు చేస్తున్నారని... ఏడాది తర్వాత వైసీపీ ఇప్పుడు ధర్నాలు చేయడం ఏమిటని?, వాళ్లకు అసలు రిజర్వేషన్లు గురించి తెలియదని సీఎం చంద్రబాబు నాయుడు వ్యాఖ్యానించారు. డీఎస్సీలో రిజర్వేషన్లకు సంబంధించి ప్రజలకు వివరాలు తెలియజేయాలని చెప్పారు. ఈ విషయాలు అన్ని ప్రజలకు పూర్తి స్థాయిలో వివరించాలని తెలిపారు. జగన్ పరామర్శలు అంటే జనం బయపడుతున్నారని సీఎం చంద్రబాబు ఎద్దేవా చేశారు. జగన్ పర్యటన వేళ ఆ పార్టీ శ్రేణులు ఒక మహిళ షాప్ ను ఎలా ధ్వంసం చేసారనేది అందరూ చూశారని అన్నారు. జగన్ పరామర్శకు వెళితే ఆయనతో పాటు ఉన్నవారు చివరకు రైతులు తెచ్చిన పొగాకును కూడా ధ్వంసం చేశారని ఆరోపించారు. దిశ అనేది అసలు చట్ట రూపం దాల్చలేదని చంద్రబాబు వ్యాఖ్యానించారు. అయితే దిశ చట్టం అని పంపితే కేంద్రం తిరస్కరించి వెనక్కి పంపిందని అన్నారు. అయినా దిశ పోలీస్ స్టేషన్లు, వాహనాలు అని చెప్పి గత వైసీపీ ప్రభుత్వం హడావుడి చేసిందని విమర్శించారు. అంతేకాకుండా, అగ్రిగోల్డ్ బాధితులకు సత్వర న్యాయం జరిగేలా చూడాలని సీఎం చంద్రబాబు నాయుడు చెప్పారు. ప్రభుత్వ చర్యలను అడ్డుకునేందుకు కొందరు కోర్టులను ఆశ్రయించాలని చూస్తున్నారని... వీటిని సమర్థవంతంగా ఎదుర్కొవాలని చెప్పారు. ఇక, వికసిత్ భారత్ లక్ష్యానికి అనుగుణంగా, స్వర్ణాంధ్ర విజన్–2047 ప్రతిబింబించేలా స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు నిర్వహించాలని తెలిపారు. నీటి వినియోగంలో మొదట తాగునీటికి, తర్వాత పశుగ్రాసానికి ప్రాధాన్యం ఇవ్వాలని చెప్పారు. ఎల్‌నినో ప్రభావం గురించి ప్రజలకు తెలియజేయాల్సిన బాధ్యత మంత్రులపై ఉందని చెప్పారు.

# ఎస్ఐఆర్ ప్రక్రియ..



కావని మిగిలిన 19 లక్షల ఫారాల పరిశీలన పూర్తి అయిన తర్వాత ఇందులో మరిన్ని మార్పులు చోటుచేసుకునే అవకాశముందని అధికారులు స్పష్టం చేస్తున్నారు. ప్రస్తుతం దాదాపు 19 లక్షల ఎన్యుమరేషన్ ఫారాలు ఇంకా డిజిటైజేషన్‌కు పెండింగ్‌లో ఉన్నాయి. ఇవి మొత్తం ఓటర్లలో సుమారు 5.6 శాతం కావడం గమనార్హం. ఈ ఫారాల డేటా నమోదు ప్రక్రియ ఆగస్ట్ 10వ తేదీ లోపు పూర్తికానుందని అధికారులు పేర్కొన్నారు. ఆ తర్వాత ఈ ఓటర్ల వివరాలను పరిశీలించి వారు ఉంటుందో లేక తొలగింపు జాబితాలో చేర్చాలో తుది నిర్ణయం తీసుకోనున్నారు. అందువల్ల తొలగింపు జాబితాలో ఉన్న వారి సంఖ్య ఇంకా పెరగవచ్చని లేదా తగ్గవచ్చని అధికారులు స్పష్టం చేశారు. ఇక ఎస్ఐఆర్ ప్రక్రియలో భాగంగా ఓటర్ల జాబితా నుంచి తొలగింపు కోసం గుర్తించిన ఓటర్లలో అత్యధికంగా గతంలో ఉన్న ప్రాంతం నుంచి ఇతర ప్రాంతాలకు శాశ్వతంగా మారిపోయిన ఓటర్లే ఉన్నారని అధికారులు చెబుతున్నారు. ఇలా మారిన వారి సంఖ్య సుమారు 34.2 లక్షలు ఉంటుందని అంటే రాష్ట్ర మొత్తం ఓటర్లలో సుమారు 10.1 శాతమని తెలుస్తోంది. అదే సమయంలో 8.9 లక్షల మంది ఓటర్లు మరణించినట్లు గుర్తించారు. మరో 6.3 లక్షల మంది వారు నమోదు చేసిన అడ్రస్‌లలో లేనివారు లేదా గుర్తించలేని వారిగా నమోదు చేశారు. మిగిలిన 6.2 లక్షల మంది డూప్లికేట్ ఓటర్లు లేదా ఇప్పటికే వేరే ప్రాంతంలో నమోదు అయినవారిగా గుర్తించారు. ఈ ఎస్ఐఆర్ ప్రక్రియలో సేకరించలేని ఎన్యుమరేషన్ ఫారాలు కూడా భారీ సంఖ్యలో ఉన్నాయని తెలుస్తోంది. మరీ ముఖ్యంగా హైదరాబాద్ మహానగర పరిధిలోని పట్టణ నియోజకవర్గాల్లో ఈ సమస్య ఎక్కువగా కనిపిస్తున్నట్లు ఒక రిపోర్ట్ వెల్లడించింది. అదే ప్రాంతంలో డిజిటైజేషన్ కోసం ఇంకా పెండింగ్‌లో ఉన్న ఫారాల సంఖ్య కూడా ఎక్కువగా ఉందని చెబుతోంది. అయినప్పటికీ ఇప్పటివరకు మొత్తం ఓటర్లలో 4 వంతులకు పైగా డిజిటైజేషన్ పూర్తి కావడం ఎస్ఐఆర్ ప్రక్రియ వేగంగా సాగుతోందని అర్థం అవుతోంది. అయితే ప్రస్తుతం ఉన్న గణాంకాలు తాత్కాలికం మాత్రమేనని ఎన్నికల అధికారులు స్పష్టం చేశారు. ఆగస్ట్ 10వ తేదీ నాటికి మిగిలిన ఎన్యుమరేషన్ ఫారాల డిజిటైజేషన్ పూర్తి అవుతుందని ఆ తర్వాతే తుది జాబితా రెడీ అవుతుందని తెలిపారు. ఆ తర్వాత అర్హులైన ప్రతి ఓటరికి ఓటు హక్కు కొనసాగించేలా అనర్హులైన నమోదులను తొలగించేలా ఎన్నికల సంఘం తుది చర్యలు చేపట్టనుందని పేర్కొన్నారు.

# ప్రభుత్వ వైద్యం మరింత ప్రజలకు చేరువే లక్ష్యం

## - నాణ్యమైన వైద్య సేవలే మా ప్రాధాన్యం

### జిల్లా డిసిహెచ్ఓ బీవీ రంగారావు తో ప్రత్యేక ముఖాముఖి



**ప్రశ్న:** జిల్లాలో బీసీహెచ్ఓ పరిధిలో ప్రస్తుతం ఎన్ని ప్రభుత్వ ఆసుపత్రులు, ఏరియా ఆసుపత్రులు, కమ్యూనిటీ హెల్త్ సెంటర్లు పనిచేస్తున్నాయి.

**డిసిహెచ్ఓ సమాధానం..** జిల్లా ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించడమే లక్ష్యంగా డి సి హెచ్ ఓ పరిధిలో ఉన్న అన్ని ప్రభుత్వ వైద్య సంస్థలు సమర్థవంతంగా పనిచేస్తున్నాయి. జిల్లా ఆసుపత్రులు, ఏరియా ఆసుపత్రులు, కమ్యూనిటీ హెల్త్ సెంటర్లు, ఉపజిల్లా స్థాయి వైద్య కేంద్రాలు నిరంతరం ప్రజలకు సేవలందిస్తున్నాయి. ప్రతి ఆసుపత్రిలో అవసరమైన వైద్య సేవలు అందేలా పర్యవేక్షణ కొనసాగుతోంది. రాష్ట్ర ప్రభుత్వం వైద్య రంగానికి అత్యంత ప్రాధాన్యం ఇవ్వడంతో సేవల నాణ్యత గణనీయంగా మెరుగుపడింది.

**ప్రశ్న:** వైద్యులు, స్టాఫ్ నర్సులు, ల్యాబ్ టెక్నీషియన్లు తదితర పోస్టుల్లో ఖాళీల పరిస్థితి ఎలా ఉంది.

**సమాధానం..** వైద్య సేవలకు ఎటువంటి అంతరాయం కలగకుండా ప్రభుత్వం ఎప్పటికప్పుడు నియామకాలు చేపడుతోంది. ఎక్కడైనా ఖాళీలు ఉన్నా కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ లేదా డిప్యుటేషన్ ద్వారా భర్తీ చేస్తూ సేవల్లో లోటు రాకుండా చర్యలు తీసుకుంటున్నాం. ప్రతి ఆసుపత్రిలో అవసరమైన మేరకు వైద్యులు, నర్సులు, సాంకేతిక సిబ్బంది అందుబాటులో ఉండేలా సమన్వయం చేస్తున్నాం.

**ప్రశ్న:** గత ఏడాదిలో కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ నియామకాలు ఎలా జరిగాయి.

**సమాధానం..** ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం అవసరమైన పోస్టులకు పారదర్శకంగా కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ నియామకాలు నిర్వహించాం. ముఖ్యంగా వైద్యులు, స్టాఫ్ నర్సులు, ల్యాబ్ టెక్నీషియన్లు, ఫార్మసిస్టులు, సపోర్టింగ్ స్టాఫ్ నియామకాల ద్వారా సేవలను మరింత బలోపేతం చేశాం. దీనివల్ల ఆసుపత్రుల్లో మానవ వనరుల కొరత గణనీయంగా తగ్గింది.

**ప్రశ్న:** జిల్లా ఆసుపత్రుల్లో మందుల కొరత ఉందా.?

**సమాధానం..** ప్రస్తుతం అవసరమైన అత్యవసర మరియు సాధారణ మందులు ప్రభుత్వ ఆసుపత్రుల్లో అందుబాటులో ఉన్నాయి. రాష్ట్ర స్థాయిలో నిరంతర మందుల సరఫరా వ్యవస్థ అమల్లో ఉంది. ఎక్కడైనా ఏదైనా ఔషధం తాత్కాలికంగా అందుబాటులో లేకపోతే వెంటనే ఇండెంట్ పంపించి సరఫరా జరిగేలా చర్యలు తీసుకుంటున్నాం. రోగులకు ఇబ్బంది కలగకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు కూడా చేస్తున్నాం.

**ప్రశ్న:** అన్ని ఆసుపత్రుల్లో 24ఐ7 అత్యవసర వైద్య సేవలు అందుబాటులో ఉన్నాయా?

**సమాధానం:** అత్యవసర వైద్య సేవలు ప్రభుత్వ వైద్య రంగంలో అత్యంత కీలకం. జిల్లా ఆసుపత్రులు, ఏరియా ఆసుపత్రులు, అవసరమైన కమ్యూనిటీ హెల్త్ సెంటర్లలో 24 గంటల సేవలు అందిస్తున్నాం. ఎమర్జెన్సీ, ప్రసూతి సేవలు, ప్రమాద బాధితులకు తక్షణ చికిత్స, అంబులెన్స్ సమన్వయం వంటి సేవలు నిరంతరం కొనసాగుతున్నాయి.

**ప్రశ్న:** వైద్య పరికరాలు పనిచేయని ఆసుపత్రులు ఏమైనా ఉన్నాయా?

**సమాధానం..** ప్రతి ఆసుపత్రిలో ఉన్న వైద్య పరికరాలను క్రమం తప్పకుండా తనిఖీ చేస్తున్నాం. ఎక్కడైనా యంత్రంలో చిన్నపాటి సాంకేతిక లోపం తలెత్తినా వెంటనే సంబంధిత సంస్థలకు సమాచారం ఇచ్చి మరమ్మతులు చేపడుతున్నాం. అత్యవసర సేవలకు అవసరమైన పరికరాలు ఎల్లప్పుడూ పనిచేసేలా ప్రత్యేక పర్యవేక్షణ ఉంటుంది.

**ప్రశ్న:** రోగుల ఫిర్యాదుల పరిష్కారానికి ప్రత్యేక వ్యవస్థ ఉందా.?

**సమాధానం..** అవును. ప్రతి ఆసుపత్రిలో రోగుల అభిప్రాయాలు, ఫిర్యాదులు స్వీకరించే వ్యవస్థ ఉంది. వచ్చిన ప్రతి ఫిర్యాదును పరిశీలించి సాధ్యమైనంత త్వరగా పరిష్కరిస్తున్నాం. జిల్లా స్థాయిలో కూడా పర్యవేక్షణ జరుగుతోంది. ప్రజల సూచనలను సేవల మెరుగుదలకు అవకాశంగా తీసుకుంటున్నాం.

**ప్రశ్న:** తల్లి--శిశు ఆరోగ్య సేవలకు ఎలాంటి ప్రాధాన్యం ఇస్తున్నారు.

**సమాధానం:** తల్లి, శిశు ఆరోగ్యమే ప్రభుత్వ ప్రధాన ప్రాధాన్యత. గర్భిణులకు క్రమం తప్పకుండా పరీక్షలు, రక్తపరీక్షలు, స్కానింగ్, పోషకాహార సూచనలు, హైరిస్క్ గర్భిణుల ప్రత్యేక పర్యవేక్షణ, సంస్థాగత ప్రసవాల ప్రోత్సాహం వంటి కార్యక్రమాలు విజయవంతంగా అమలవుతున్నాయి. ప్రసవానంతర తల్లి, నవజాత శిశువుల ఆరోగ్యంపై కూడా నిరంతర పర్యవేక్షణ కొనసాగుతోంది.

**ప్రశ్న:** డయాలసిస్, ఐసీయూ, రక్త బ్యాంక్, స్కానింగ్ సేవలు అందుబాటులో ఉన్నాయా.?

**సమాధానం..** ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకుని జిల్లా స్థాయిలో ప్రత్యేక వైద్య సేవలను విస్తరిస్తున్నాం. డయాలసిస్ సేవలు, ఐసీయూ సౌకర్యాలు, రక్త బ్యాంకులు, స్కానింగ్, ల్యాబ్ సేవలు అందుబాటులో ఉన్నాయి. అవసరమైన చోట్ల సేవల విస్తరణ కూడా కొనసాగుతోంది. రోగులు ప్రైవేట్ ఆసుపత్రులపై ఆధారపడాల్సిన అవసరం తగ్గేలా చర్యలు తీసుకుంటున్నాం.

**ప్రశ్న:** ఇటీవల ఆసుపత్రుల పనితీరుపై తనిఖీలు జరిగాయా.?

**సమాధానం..** అవును. జిల్లా అధికారులు, రాష్ట్ర స్థాయి అధికారులు క్రమం తప్పకుండా ఆసుపత్రులను తనిఖీ చేస్తున్నారు. పరిశుభ్రత, వైద్య సేవలు, మందుల నిల్వలు, రోగుల సంతృప్తి, వైద్య సిబ్బంది హాజరు, మౌలిక వసతులపై సమీక్షలు నిర్వహిస్తున్నారు. ఎక్కడైనా లోపాలు గుర్తిస్తే వెంటనే సరిదిద్దే చర్యలు తీసుకుంటున్నాం.

**ప్రశ్న:** కొత్తగా మంజూరైన పోస్టులు, అభివృద్ధి పనుల పురోగతి ఎలా ఉంది.

**సమాధానం..** ప్రభుత్వం వైద్య రంగ బలోపేతానికి నిరంతరం నిధులు కేటాయిస్తోంది. అవసరమైన చోట కొత్త పోస్టులు మంజూరు చేయడం, భవనాల నిర్మాణం, మరమ్మతులు, అదనపు వార్డులు, ఆధునిక వైద్య పరికరాల ఏర్పాటు వంటి పనులు దశలవారీగా కొనసాగుతున్నాయి. ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించేందుకు మౌలిక సదుపాయాలను బలోపేతం చేస్తున్నాం.

**ప్రశ్న:** ప్రజలకు మరింత మెరుగైన వైద్య సేవలు అందించేందుకు డిసిహెచ్ఓ కార్యాలయం చేపడుతున్న ప్రధాన కార్యక్రమాలు ఏమిటి.

**సమాధానం..** ప్రభుత్వ ఆసుపత్రులపై ప్రజల విశ్వాసాన్ని మరింత పెంచడమే మా ప్రధాన లక్ష్యం. నాణ్యమైన వైద్య సేవలు, ఉచిత మందులు, ఆధునిక పరీక్షలు, మాతా--శిశు సంక్షేమం, అంటువ్యాధుల నివారణ, ఆరోగ్య శిబిరాలు, ప్రత్యేక వైద్య శిబిరాలు, సిబ్బందికి శిక్షణ కార్యక్రమాలు, డిజిటల్ సేవల విస్తరణ వంటి అనేక కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేస్తున్నాం. ప్రతి రోగికి సకాలంలో, సంతృప్తికరమైన వైద్య సేవలు అందించేందుకు డిసిహెచ్ఓ కార్యాలయం నిరంతరం కృషి చేస్తోంది.

ప్రభుత్వ ఆసుపత్రి అంటే కేవలం ఉచిత వైద్యం మాత్రమే కాదు, నాణ్యమైన వైద్యం కూడా అందే కేంద్రంగా మార్చడమే మా సంకల్పం. ప్రతి రోగికి గౌరవప్రదమైన వైద్య సేవలు అందించాలనే లక్ష్యంతో జిల్లా వైద్య యంత్రాంగం సమష్టిగా పనిచేస్తోంది. వైద్యుల అంకితభావం, సిబ్బంది సేవా దృక్పథం, ప్రభుత్వ మద్దతు కలిసి ప్రభుత్వ వైద్య రంగాన్ని మరింత బలోపేతం చేస్తున్నాయి. ప్రజలు ప్రభుత్వ ఆసుపత్రులపై పూర్తి విశ్వాసంతో ముందుకు రావాలి. ప్రతి సూచనను స్వాగతిస్తూ, సేవలను ఇంకా మెరుగుపరచేందుకు నిరంతరం కృషి చేస్తూనే ఉంటాం.

## నంద్యాల తాలూకా పోలీస్ స్టేషన్ పరిధిలో దొంగతనం కేసును ఛేదించిన పోలీసులు

**- అంతరాష్ట్ర దొంగ అరెస్ట్**

**- 15 లక్షల విలువైన 115 గ్రాముల బంగారు ఆభరణాల స్వాధీనం**




**నంద్యాల** నంద్యాల తాలూకా పోలీస్ స్టేషన్ పరిధిలో నమోదైన అతీ.ఔనీ.52/2025, జ/రావఖ. 305(జీ), 331(4) ఃబొ కేసులో నిందితుడిని అరెస్ట్ చేసి, దొంగిలించబడిన బంగారు ఆభరణాలను స్వాధీనం చేసుకున్నట్లు నంద్యాల జిల్లా పోలీసులు తెలిపారు. 2025 సంవత్సరం మార్చి నెల 7 వ తేదీన సాయంత్రం సుమారు 7 గంటలకు ప్రాంతంలో శివ సాయి గార్డెన్ లో నివసిస్తున్న ఫిర్యాదిదారుడు కోదండరామిరెడ్డి, అతని భార్య నిత్యవసర సరుకుల నిమిత్తం ఇంటి నుండి బయటకు వెళ్లగా ఇదే సమయంలో ఇంటిలో దొంగతనం జరిగిందన్న ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేయడం జరిగింది.సదరు కేసులో నిందితుల ఆచూకీపై పోలీసులకు అందిన విశ్వసనీయ సమాచారం మేరకు, గౌరవ నంద్యాల జిల్లా ఎస్పీ శ్రీ సునీల్ షొరాణ్, ఎఖూ గారి ఆదేశాలమేరకు, నంద్యాల సబ్ డివిజనల్ యాఖ శ్రీమతి సుస్మిత, ఎఖూ గారి పర్యవేక్షణలో, నంద్యాల తాలూకా సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ఆర్. ఈశ్వరయ్య మరియు నంద్యాల అఊా ఇన్స్పెక్టర్ పి. సురేష్ కుమార్ ఆధ్వర్యంలో ప్రత్యేక పోలీసు బృందం 06-08-2026న నంద్యాల పట్టణంలోని రైతునగర బ్రిడ్జి వద్ద వాహనాల తనిఖీలు నిర్వహిస్తున్న సందర్భంలో పోలీసులను గమనించిన ఒక అనుమానితుడు తప్పించుకునేందుకు ప్రయత్నం చేయగా అతనిని అదుపులోకి తీసుకొని విచారించగా, సదరు వ్యక్తి పై కేసులో తన ప్రమేయాన్ని స్వచ్ఛందంగా అంగీకరించాడు. అనంతరం అతడిని అరెస్ట్ చేసి, అతని వద్ద నుండి దొంగిలించిన బంగారు ఆభరణాలను స్వాధీనం చేసుకోవడం జరిగింది.ఈ కేసులో మిగిలిన నిందితుల కోసం ప్రత్యేక పోలీసు బృందాలు గాలింపు చర్యలు కొనసాగిస్తున్నాయి.

## రూ.3.50 కోట్ల గంజాయి కాల్చివేత..

**- 696.1 కేజీల ల మేరకు దహనం.**

ఖమ్మం జిల్లా కొత్తగూడెం జిల్లాలోని నాలుగు ఎక్సైజ్ సేష్టన్లలో పట్టుబడిన రూ. 3.50 కోట్ల విలువ చేసే 696.1 కేజీల గంజాయిని ఖమ్మం డిప్యూటి కమిషనర్ సోమిరెడ్డి అదేశాల మేరకు గురువారం కాల్చివేశారు.కొత్తగూడెం జిల్లాలోని కొత్తగూడెం ఎక్సైజ్ స్టేషన్‌లో 316.07 పేజీల గంజాయిని, భద్రాచలం ఎక్సైజ్ స్టేషన్‌లోని 329.51 కేజీల గంజాయిని, పాల్వంచ ఎక్సైజ్‌స్టేషన్‌లో 43.62 కేజీల గంజాయిని, మణుగూర్ ఎక్సైజ్ స్టేషన్ లోని 6.9 కేజీల గంజాయిని ప్రభుత్వ అమోదం పొందిన ఏ డబ్ల్యూఎస్ కన్సెటెనింగ్ గొపాల్‌పేట్ తల్లెడ మం డలంలోని గంజాయి కాల్చివేత పరిశ్రమలో కల్చివేశారు.నాలుగు ఎక్సైజ్ స్టేషన్లలోని 32 కేసుల్లో పట్టుబడిన గంజాయిని దహనం చేయాలని ఖమ్మం డిప్యూటి కమిషనర్ సోమిరెడ్డి ఇచ్చిన అదేశాల మేరకు ఈఎస్ శ్రీనివాసరెడ్డి సీఐలు ఇతర సిబ్బంది కలిసి గంజాయిని కాల్చివేశారు.

# సిఐటియు జైల్ బరో



**కీసర (ప్రశ్న న్యూస్)** కేంద్ర ప్రభుత్వ కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఆగస్టు 10న నిర్వహించే జైలు బరో కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని విస్తృతంగా ప్రచారం నిర్వహించడం జరిగిందని సిఐటియు కీసర మండల కార్యదర్శి బంగారు నర్సింగరావు తెలియజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం కార్మిక, కర్షక ,,ప్రజా వ్యతిరేక విధానాలను అవలంబిస్తూ ప్రజల యొక్క స్వేచ్ఛ, స్వాతంత్రాలను, హక్కులను కాలరాస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. మోడీ ప్రభుత్వం నియంత్రత్వ విధానాలకు వ్యతిరేకంగా క్విట్ ఇండియా ఉద్యమ స్ఫూర్తితో ఆగస్టు 10న జైలు భరో కార్యక్రమాన్ని సిఐటియు నిర్వహిస్తుందని ఇందులో యావత్ కార్మిక వర్గం పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. సిఐటియు జైలు బరో కరపత్రాలను మున్సిపల్ కార్మికుల్లో పంపిణీ చేసి విస్తృత ప్రచారం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో బండ్లగూడ , దుబాయ్ బిల్డింగ్ ,దమ్మైగూడ ,ఆర్ జి కే కాలనీ, టు బిహెచ్కె అహ్మద్ గూడ ప్రాంతంలోని మున్సిపల్ కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## పంద్రాగస్టు వేడుకలకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలి

**- కలెక్టర్ చిత్రా మిశ్రా**



**కరీంనగర్** పంద్రాగస్టు వేడుకలకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ చిత్రా మిశ్రా సంబంధిత శాఖ అధికారులను ఆదేశించారు. గురువారం జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాలులో అదనపు కలెక్టర్ శ్రీనివాసరెడ్డి , అదనపు డీసీపీ వెంకటరమణతో కలిసి వివిధ శాఖల అధికారులతో పంద్రాగస్టు ఏర్పాట్లపై సమీక్ష నిర్వహించారు. వేడుక సజావుగా సాగేలా చేపట్టాల్సిన ఏర్పాట్లపై అధికారులకు దిశా నిర్దేశం చేశారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ. ప్రోటోకాల్ సమస్య తలెత్తకుండా నిబంధనల ప్రకారం ఏర్పాట్లు చేయాలని సూచించారు. వేదిక వద్ద సీటింగ్, తాగునీరు తదితర సౌకర్యాలు కల్పించాలన్నారు. దేశభక్తి పెంపొందించే సాంస్కృతిక కార్యక్రమాల నిర్వహణలో ఇబ్బందులు కలగకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. వర్షం కురిసినా ప్రోగ్రాం కు ఇబ్బంది కలగకుండా ఏర్పాట్లు చేయాలని.. ప్రోటోకాల్ నిబంధనలు పాటిస్తూ అవసరమైన చర్యలు చేపట్టాలని పోలీస్ శాఖ అధికారులను ఆదేశించారు. స్టాల్స్, శకటాల ఏర్పాట్లపై ప్రత్యేక దృష్టి సారించాలి:వివిధ శాఖల పనితీరు తెలిసేలా స్టాల్స్ ఏర్పాటు చేయాలని సంబంధిత శాఖ అధికారులను ఆదేశించారు. వ్యవసాయ శాఖ, గృహ నిర్మాణ శాఖ, ఆర్టీసీ, వైద్యశాఖ, పంచాయతీరాజ్, జిల్లా గ్రామీణ అభివృద్ధి శాఖల పనితీరు తెలిసేలా ప్రత్యేక స్టాల్స్ , శకటాలు ఏర్పాటు చేయించాలన్నారు. స్వయం సహాయక సంఘాల సభ్యులకు అందించే రుణాలతో కూడిన స్టాల్స్, శకటాలు ఏర్పాటు చేయాలన్నారు. సెర్ప్, మెప్మా ఆధ్వర్యంలో తయారుచేస్తున్న ఉత్పత్తులను ప్రదర్శించాలన్నారు. ఇందిరమ్మ ఇళ్ల శకటం, డ్రగ్స్ నియంత్రణకు పోలీస్ శాఖ తీసుకుంటున్న చర్యలతో శకటం ఏర్పాటు చేయాలన్నారు.ఎల్ నినో వర్షాభావ పరిస్థితులను తట్టుకునేలా తీసుకుంటున్న చర్యలతో స్టాల్ ఏర్పాటు చేయాలని ఉద్యాన, వ్యవసాయ శాఖ అధికారులను ఆదేశించారు. వ్యవసాయం, ఫిషరీస్ శాఖ ఆధ్వర్యంలో సంయుక్తంగా స్టాల్ ఏర్పాటు చేయాలన్నారు.వైద్యశాఖ ఆధ్వర్యంలో ప్రత్యేక స్టాల్ ఏర్పాటు చేయాలన్నారు.ఓఆర్ఎస్ ప్యాకెట్లు, అంబులెన్స్, ఫైరింజన్ అందుబాటులో ఉంచాలన్నారు. విద్యుత్ సరఫరాలో అంతరాయం, పార్కింగ్ లో ఇబ్బందులు కలగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ప్రశంసా పత్రాలు అందించేందుకు ఉత్తమ పనితీరు కనబరిచే ఉద్యోగులను ఎంపిక చేయాలని సూచించారు.వేడుకలకు హాజరయ్యే అతిథులు, మీడియా కు ఇబ్బందులు కలగకుండా చూడాలన్నారు. అవసరమైన తాగునీరు, టెంట్లు, పబ్లిక్ అడ్రస్ సిస్టం తదితర ఏర్పాట్లను ఆయా శాఖల అధికారులు ఏర్పాట్లు చేయాలి అని ఆదేశించారు.ఈ కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## తమిళనాడు ఎక్స్‌ప్రెస్‌లో ట్రాలీ బ్యాగ్‌లో మృతదేహం కలకలం..

చెన్నై నుంచి ఢిల్లీకి వెళ్తున్న తమిళనాడు ఎక్స్‌ప్రెస్ జనరల్ బోగీలో ఎర్ర రంగు ట్రాలీ బ్యాగ్‌లో ఓ మృతదేహం లభ్యమైంది.మృతదేహానికి తలతో పాటు కొన్ని శరీర భాగాలు లేకపోవడం, పాలిథిన్‌లో చుట్టి ఉండటం సంచలనం సృష్టించింది.పాలిథిన్‌పై చెన్నైకు సంబంధించిన స్లిప్ లభించడంతో పోలీసులు అన్ని కోణాల్లో దర్యాప్తు చేస్తున్నారు.ఉత్తరప్రదేశ్‌లోని ఆగ్రా జీఆర్పీ ట్రాలీ బ్యాగ్‌ను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసి విచారణ ప్రారంభించింది. మృతుడి గుర్తింపు, హత్యకు కారణాలపై దర్యాప్తు కొనసాగుతోంది.

## సి.బెలగల్ పోలీస్ స్టేషన్‌నుఆకస్మిక తనిఖీ చేసిన కర్నూలు జిల్లా ఎస్పీ. విక్రాంత్ పాటిల్

**- మహిళలపై నేరాలపై తక్షణ స్పందన ఉండాలి**

**- సైబర్ మోసాలు, బాల్యవివాహాల నిర్మూలనపై విస్తృత అవగాహన కల్పించాలి**



**సి.బెలగల్,** కర్నూలు జిల్లా సి.బెలగల్ పోలీస్ స్టేషన్‌ను గురువారం జిల్లా పోలీసు సూపరింటెండెంట్ (ఎస్పీ) విక్రాంత్ పాటిల్, ఐపీఎస్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పోలీస్ స్టేషన్‌లోని పరిపాలనా వ్యవహారాలు, రికార్డులు, నమోదైన కేసులు, పెండింగ్‌లో ఉన్న కేసుల పురోగతి, నిందితుల అరెస్టులు, దర్యాప్తు తీరును సమగ్రంగా పరిశీలించి అధికారులకు పలు కీలక సూచనలు చేశారు.ప్రజలకు నాణ్యమైన పోలీసు సేవలు అందించడం ప్రతి పోలీసు అధికారి ప్రధాన బాధ్యత అని ఎస్పీ పేర్కొన్నారు. పోలీస్ స్టేషన్‌కు వచ్చే బాధితులను మర్యాదపూర్వకంగా స్వాగతించి, వారి ఫిర్యాదులను సత్వరమే నమోదు చేసి, సమస్యల పరిష్కారానికి వేగంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. బాధితుల్లో పోలీసులపై నమ్మకం పెరిగేలా పనిచేయాలని ఆదేశించారు.మహిళలపై జరిగే నేరాల విషయంలో ఏమాత్రం నిర్లక్ష్యం వహించకుండా వెంటనే స్పందించి, బాధితులకు త్వరితగతిన న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. మహిళల భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని, మహిళలు నిర్భయంగా జీవించే వాతావరణం కల్పించడం పోలీసు శాఖ బాధ్యత అని పేర్కొన్నారు.గ్రామీణ ప్రాంతాల్లో ఇప్పటికీ చోటుచేసుకుంటున్న బాల్యవివాహాలను పూర్తిగా నిర్మూలించేందుకు గ్రామస్థాయిలో విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. సంబంధిత శాఖలతో సమన్వయం చేసుకొని బాల్యవివాహాలను అడ్డుకునేందుకు కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.ఇటీవలి కాలంలో పెరుగుతున్న సైబర్ నేరాల నేపథ్యంలో ప్రజలను అప్రమత్తం చేయడం అత్యంత అవసరమని ఎస్పీ అన్నారు. సైబర్ మోసాల బారిన పడిన బాధితులకు వెంటనే స్పందించి, వారు కోల్పోయిన సొమ్ము తిరిగి పొందేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని సూచించారు. అలాగే సైబర్ హెల్ప్‌లైన్ 1930 గురించి ప్రతి గ్రామంలో విస్తృత ప్రచారం నిర్వహించి, ప్రజలకు అవగాహన కల్పించాలని ఆదేశించారు.రోడ్డు ప్రమాదాల నియంత్రణకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఎస్పీ సూచించారు. డ్రంకెన్ డ్రైవ్, ఓపెన్ డ్రింకింగ్ వంటి ఉల్లంఘనలపై ప్రత్యేక తనిఖీలు నిర్వహించి, నిబంధనలు అతిక్రమించే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రజల్లో రోడ్డు భద్రతపై అవగాహన పెంపొందించే కార్యక్రమాలు కూడా నిర్వహించాలని చెప్పారు.అలాగే ప్రాపర్టీ కేసులను త్వరితగతిన ఛేదించి, దొంగిలించిన ఆస్తులను బాధితులకు తిరిగి అందించేలా రికవరీ ప్రక్రియను వేగవంతం చేయాలని సూచించారు. ప్రజల్లో భద్రతాభావం పెంపొందించేలా గ్రామాలు, పట్టణాల్లో విజిబుల్ పోలీసింగ్ మరింత సమర్థవంతంగా నిర్వహించాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు.ఈ తనిఖీలో కర్నూలు జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్‌తో పాటు కోడుమూరు సీఐ తబ్రేజ్, సి.బెలగల్ ఎస్సై వేణుగోపాల్ రాజు తదితర పోలీసు అధికారులు పాల్గొన్నారు. జిల్లా పోలీసు కార్యాలయం విడుదల చేసిన ఈ పత్రికా ప్రకటనలో ప్రజలకు మరింత సమర్థవంతమైన, పారదర్శకమైన పోలీసు సేవలు అందించేందుకు జిల్లా పోలీసు శాఖ కట్టుబడి ఉందని పేర్కొన్నారు.

## గిరిజన చట్టాలు పటిష్టంగా అమలు చేయాలి

**- ఎస్టీ కమిషన్ చైర్మన్ చోళబొజ్జ రెడ్డి కు కోరిన గిరిజన ఉద్యోగుల సంఘం నాయకులు**

**అరకులోయ** గిరిజన ప్రాంతంలో ఉన్న గిరిజన చట్టాలు 1/70 , పెస చట్టం పటిష్టంగా అమలు చేయాలని కోరుతూ గురువారం అరకులోయ గిరిజన ఉద్యోగుల సంఘ నాయకులు ఆనందరావు,దనురాజ్, సింహాచలం, ఈశ్వరరావు, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎస్టీ కమిషన్ చైర్మన్ చోళ్ల బొజ్జి రెడ్డి ను కలిసి వినతి పత్రం అందజేశారు.

ఈ సందర్భంగా మాట్లాడుతూ ఏజెన్సీ ప్రాంతాల్లో హక్కుల పరిరక్షణ , చట్టాల అమలుపై దృష్టి పెట్టాలని కోరారు.1/70 , పెస చట్టాలను పటిష్టంగా అమలు చేసి గిరిజన భూములు అన్యాక్రాంతం కాకుండా చూడాలన్నారు.గిరిజనులకు జీవ నాడి అయిన జీవో నెంబర్ 3 కు చట్ట బద్దత కల్పించి స్థానిక గిరిజన నిరుద్యోగులకు ఉద్యోగాలు కల్పించాలని ,అలాగే గిరిజనులు ఎదుర్కొంటున్న విద్య, వైద్య, ఉపాధి సమస్యల పై చర్యలు తీసుకోవాలని ఆయన దృష్టికి తీసుకుని వెళ్లారు.ఈ సమస్యల ను రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకుని వెళ్లి సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని ఎస్టీ కమిషన్ చైర్మన్ చెప్పారు.

## డీఎస్సీ అభ్యర్థులకు న్యాయం చేయాలి

**- అర్హులైన అభ్యర్థులకు ఉద్యోగాలు కల్పించాలి**

**- అరకు ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం.**

**అరకులోయ** రాష్ట్ర ప్రభుత్వం మెగా డీఎస్సీ పేరిట 2025 సంవత్సరంలో నిర్వహించిన డీఎస్సీలో అక్రమాలు జరిగాయని విమర్శించారు. జరిగిన అవకాతవకలపై సిబిఐ దర్యాప్తు నిర్వహించాలని జరిగిన తప్పుని బాధ్యత వహించి విద్యాశాఖ మంత్రిగా కొనసాగుతున్న నారా లోకేష్ రాజీనామా చేయాలని డిమాండ్ చేసిన అరకు నియోజకవర్గ ఎమ్మెల్యే రేగం మత్స్యలిం నిరాహార దీక్షలో పాల్గొన్న అరకులోయ అసెంబ్లీ నియోజకవర్గ ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం మాట్లాడుతూ అర్హులైన అభ్యర్థులకు ఉద్యోగం కల్పించకుండా, స్పోర్ట్స్ కోట పేరిట అవకతవకలు జరిగాయని విమర్శించారు.బిగుర్తింపు లేని స్పోర్ట్స్ సర్టిఫికెట్ల ద్వారా దొంగ దారిన లక్షల రూపాయలకు ఉపాధ్యాయ పోస్టులు కూటమి ప్రభుత్వం అమ్ముకున్నారని ఆరోపణ చేశారు.బి అర్హత సాధించిన డీఎస్సీ అభ్యర్థులకు పోస్టులు కేటాయించాలని డిమాండ్ చేస్తూ, అభ్యర్థులకు న్యాయం జరగనిచో మరింత ఉద్యమం చేయటానికి ముందుకు వెళ్తామని హెచ్చరించిన అరకులోయ అసెంబ్లీ నియోజకవర్గ ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం ఈ కార్యక్రమంలో విద్యార్థి విభాగం యువజన విభాగల ప్రతినిధులు జెడ్పీటీసీలు, ఎంపీపీలు, మాజీ సర్పంచులు, ఎంపీటీసీలు వివిధ హోదాలో ఉన్న పార్టీ శ్రేణులు, డీఎస్సీ అభ్యర్థులు, యువకులు పాల్గొన్నారు.

## జగన్ పర్యటనలో మా హోటల్ ధ్వంసం కాలేదు

**తాడేపల్లి** తూర్పుగోదావరి జిల్లా దేవరపల్లి హోటల్ నిర్వాహకులు గురువారం నాడు వైఎస్సార్సీపీ కేంద్ర కార్యాలయంలో మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్సీపీ అధినేత వైయస్ జగన్ మోహన్ రెడ్డిని కలిసారు. వైయస్ జగన్ దేవరపల్లి పొగాకు బోర్డు వేలం కేంద్రం పర్యటనలో జనం రద్దీ వల్లే తోపులాట జరిగిందని, అంతేకానీ వైఎస్సార్సీపీకి ఎలాంటి సంబంధం లేదని వైయస్ జగన్కు హోటల్ నిర్వాహకులు చందన వరలక్ష్మి, చందన దివ్య వివరించారు. వైస్సార్సీపీ కార్యకర్తలు తమ హోటల్ ధ్వంసం చేశారన్న ప్రచారంలో వాస్తవం లేదన్న నిర్వాహకులు, తాము వైఎస్సార్సీపీనేనని, వైయస్ జగన్ ప్రభుత్వంలో తమ కుటుంబం లబ్ధిపొందిందని నిర్వాహకులు అన్నారు.

ప్రజాప్రశ్న
హైదరాబాద్ శుక్రవారం 7, ఆగష్టు 2026

# నేతన్నలకు రూ.25 వేల భరోసా

- నేడు 'నేతన్న సేవలో' పథకానికి శ్రీకారం, 71,536 కుటుంబాలకు రూ.179 కోట్ల జమ
- చేనేత దినోత్సవం సందర్భంగా చీరాలలో సీఎం చంద్రబాబు ప్రారంభం




**అమరావతి(ప్రశ్న న్యూస్)** చేనేత కుటుంబాల ఆర్థిక భరోసా కోసం రాష్ట్ర ప్రభుత్వం మరో కీలక సంక్షేమ కార్యక్రమానికి శ్రీకారం చుడుతోంది. జాతీయ చేనేత దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం చీరాలలో నిర్వహించే కార్యక్రమంలో ముఖ్యమంత్రి చంద్రబాబు 'నేతన్న సేవలో' పథకాన్ని ప్రారంభించనున్నారు. ఈ పథకం కింద రాష్ట్రంలోని అర్హత కలిగిన ప్రతి చేనేత కుటుంబానికి రూ.25 వేల చొప్పున ఆర్థిక సాయం అందించనున్నారు. తొలి విడతలో రాష్ట్రవ్యాప్తంగా 71,536 చేనేత కుటుంబాలకు మొత్తం రూ.179 కోట్లను నేరుగా వారి ఖాతాల్లో జమ చేయనున్నారు.ప్రభుత్వం ఇప్పటికే చేనేత రంగానికి పలు సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తుండగా, తాజాగా ప్రవేశపెట్టిన 'నేతన్న సేవలో' పథకం ద్వారా నేతన్న కుటుంబాలకు మరింత ఆర్థిక భరోసా కల్పించనున్నట్లు ప్రభుత్వం వెల్లడించింది. చేనేత వృత్తిని ప్రోత్సహించడం, వారసత్వ కళను పరిరక్షించడం, నేతన్నల జీవనోపాధిని బలోపేతం చేయడం లక్ష్యంగా ఈ పథకాన్ని అమలు చేస్తున్నట్లు పేర్కొంది.చేనేత కుటుంబాలకు నెలకు 200 యూనిట్ల వరకు, పవర్‌లూమ్ యూనిట్లకు 500 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్‌ను ప్రభుత్వం అందిస్తోంది. ఈ పథకం ద్వారా 62,541 చేనేత కుటుంబాలు, 10,032 పవర్‌లూమ్ యూనిట్లు లబ్ధి పొందుతున్నాయి. ఇందుకోసం ఏటా రూ.150 కోట్లను ప్రభుత్వం వెచ్చిస్తోంది. అలాగే 50 ఏళ్లు నిండిన సుమారు 85 వేల మంది చేనేత కార్మికులకు నెలకు రూ.4 వేల పింఛన్ అందిస్తూ ఏడాదికి రూ.420 కోట్ల వ్యయాన్ని భరిస్తోంది.చేనేత సహకార సంఘాల బలోపేతానికి 109 ప్రాథమిక సహకార సంఘాలకు క్యాష్ క్రెడిట్ ద్వారా రూ.79 కోట్ల ఆర్థిక సహాయం అందించింది. ఉప్పాడలో ప్రత్యేక మౌలిక సదుపాయాల ప్రాజెక్టు, మంగళగిరిలో హ్యాండ్లూమ్ పార్కు, అమరావతి సమీపంలోని శాఖమూరులో చేనేత, హస్తకళల మ్యూజియం ఏర్పాటు పనులు కొనసాగుతున్నాయి. విశాఖపట్నంలో రూ.4,200 కోట్ల పెట్టుబడితో సుస్థిర టెక్స్‌టైల్ రీసైక్లింగ్ యూనిట్ ఏర్పాటు కానుండటం చేనేత రంగానికి మరింత ఊతమివ్వనుందని ప్రభుత్వం భావిస్తోంది.చేనేత దినోత్సవం సందర్భంగా చీరాల నియోజకవర్గంలో ముఖ్యమంత్రి చంద్రబాబు పర్యటించనున్నారు. ఉదయం కొత్తపేటలో జరిగే బహిరంగ సభలో పాల్గొని 'నేతన్న సేవలో' పథకాన్ని ప్రారంభించి లబ్ధిదారుల ఖాతాల్లో నిధులు విడుదల చేయనున్నారు. అనంతరం జాండ్రపేటలోని చేనేత వర్క్‌షాప్‌ను సందర్శించి నేతన్న కుటుంబాలతో ముఖాముఖి నిర్వహించనున్నారు. ఆ తర్వాత స్థానిక పార్టీ శ్రేణులతో సమీక్షా సమావేశంలో పాల్గొని తిరిగి అమరావతికి చేరుకోనున్నారు.

# నెలల తరబడి జీతాలు బకాయి

- స్కూల్ స్వీపర్లు, నైట్‌వాచ్‌మెన్‌కు వెంటనే వేతనాలు చెల్లించాలి
- ఎంఈఓ-2కు సీఐటీయూ ఆధ్వర్యంలో వినతిపత్రం



**ఇబ్రహీంపట్నం(ప్రశ్న న్యూస్)** ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తున్న శానిటేషన్ స్వీపర్లకు నాలుగు నెలలుగా, నైట్‌వాచ్‌మెన్‌కు ఎనిమిది నెలలుగా పెండింగ్‌లో ఉన్న వేతనాలను వెంటనే విడుదల చేయాలని కోరుతూ సీఐటీయూ ఆధ్వర్యంలో స్కూల్ స్వీపర్లు, నైట్‌వాచ్‌మెన్ ప్రతినిధులు గురువారం ఇబ్రహీంపట్నం ఎంఈఓ-2 ఎం. వీరాస్వామికి వినతిపత్రం అందజేశారు.ఈ సందర్భంగా సీఐటీయూ మండల కార్యదర్శి ఎం. మహేష్ మాట్లాడుతూ నెలకు కేవలం రూ.6 వేల వేతనంతోనే జీవనం సాగించడం కష్టంగా ఉండగా, నెలల తరబడి జీతాలు కూడా చెల్లించకపోవడంతో కార్మికులు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ పాఠశాలల నిర్వహణలో కీలక పాత్ర పోషిస్తున్న స్వీపర్లు, నైట్‌వాచ్‌మెన్ సేవలను ప్రభుత్వం గుర్తించి, పెండింగ్‌లో ఉన్న నాలుగు నెలల, ఎనిమిది నెలల వేతనాలను తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేశారు.అంతేకాకుండా ప్రభుత్వం కనీస వేతన చట్టం ప్రకారం స్కూల్ స్వీపర్లు, నైట్‌వాచ్‌మెన్‌కు కనీస వేతనాలు అమలు చేయాలని, ప్రస్తుతం ఇస్తున్న రూ.6 వేల వేతనం కుటుంబ పోషణకు ఏమాత్రం సరిపోదని అన్నారు. విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ జోక్యం చేసుకొని వీరికి నెలకు రూ.26 వేల కనీస వేతనం అమలు చేసేలా చర్యలు తీసుకోవాలని కోరారు.ఈ కార్యక్రమంలో సీఐటీయూ మండల ఉపాధ్యక్షురాలు కె. రాజేశ్వరి, ఇబ్రహీంపట్నం మండల స్కూల్ స్వీపర్స్ యూనియన్ (సీఐటీయూ) అధ్యక్షురాలు పి. సుజాత, కార్యదర్శి శివకుమారి, సభ్యులు మణి, విజయరాణి, అపమ్మ, దుర్గా, నైట్‌వాచ్‌మెన్ సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

# డీఎస్సీపై వైఎస్సార్సీపీ రాష్ట్రవ్యాప్త పోరు

- రిలే నిరాహార దీక్షలతో ప్రభుత్వంపై ఒత్తిడి
- అన్ని జిల్లాల్లో నిరసనలు అక్రమాలపై సమగ్ర విచారణకు డిమాండ్



అమరావతి(ప్రశ్న న్యూస్ )డీఎస్సీ నియామక ప్రక్రియలో అక్రమాలు జరిగాయని ఆరోపిస్తూ వైఎస్సార్సీపీ రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించిన రిలే నిరాహార దీక్షలు గురువారం రాజకీయంగా చర్చనీయాంశంగా మారాయి. జిల్లా కేంద్రాలు, నియోజకవర్గాలు, మండల స్థాయిల్లో పార్టీ నేతలు, నిరుద్యోగ యువత, డీఎస్సీ అభ్యర్థులు, విద్యార్థి సంఘాల ప్రతినిధులు దీక్షల్లో పాల్గొన్నారు. డీఎస్సీ నియామకాల్లో పూర్తి పారదర్శకత పాటించాలని, అభ్యర్థుల అనుమానాలకు ప్రభుత్వం స్పష్టమైన సమాధానాలు ఇవ్వాలని, ఆరోపణలపై స్వతంత్ర విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. ఈ నిరసన కార్యక్రమాన్ని పార్టీ రాష్ట్ర నాయకత్వం పిలుపు మేరకు రాష్ట్రవ్యాప్తంగా చేపట్టినట్లు వైఎస్సార్సీపీ తెలిపింది. దీక్షా శిబిరాల్లో మాట్లాడిన పార్టీ నాయకులు డీఎస్సీ పరీక్షల నిర్వహణ, మెరిట్ జాబితాల రూపకల్పన, అభ్యర్థుల అభ్యంతరాల పరిష్కారంలో ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించిందని ఆరోపించారు. నిరుద్యోగ యువత భవిష్యత్తుతో ప్రభుత్వం చెలగాటమాడుతోందని విమర్శించారు. వైఎస్సార్సీపీ నాయకులు మాట్లాడుతూ డీఎస్సీ వ్యవహారంపై ఇప్పటికే ప్రభుత్వం వివరణ ఇవ్వాలని పలు మార్లు కోరినా స్పందన రాలేదన్నారు. అభ్యర్థుల ఫిర్యాదులను పరిశీలించకుండా వాటిని కొట్టిపారేయడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని పేర్కొన్నారు. నియామక ప్రక్రియపై విశ్వాసం కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వానిదేనని అన్నారు.రాష్ట్రవ్యాప్తంగా జరిగిన రిలే నిరాహార దీక్షలతో డీఎస్సీ అంశం మరోసారి రాజకీయ కేంద్రబిందువుగా మారింది. ప్రభుత్వం తదుపరి ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందనే దానిపై నిరుద్యోగులు, అభ్యర్థులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.

# ఘనంగా తీజ్ ఉత్సవాలు

- పాల్గొన్న బిఆర్ఎస్, బిజెపి నేతలు





**మేడ్చల్ (ప్రశ్న న్యూస్ )** మేడ్చల్ జిల్లా ఎల్లంపేట మున్సిపాలిటీ పరిధిలోని 8వ వార్డు సైదోనిగడ్డ తాండలో తీజ్ ఉత్సవాలు మున్సిపల్ చైర్ పర్సన్ లావుడ్య శ్రీదేవి రమేష్ నాయక్ ఆధ్వర్యంలో గురువారం ఘనంగా నిర్వహించారు.ఈ ఉత్సవాలకు ముఖ్యఅతిథిగా బీఆర్ఎస్ నియోజకవర్గ ఇంచార్జ్ చామకూర మహేందర్ రెడ్డి,బీజేపీ జిల్లా అధ్యక్షులు బుద్ధి శ్రీనివాస్,బీజేపీ నియోజకవర్గ ఇంచార్జ్ ఏనుగు సుదర్శన్ రెడ్డి,జిల్లా ఉపాధ్యక్షుడు జగన్ గౌడ్ హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తీజ్ ఉత్సవాలు గిరిజన సంస్కృతీ సంప్రదాయాలకు ప్రతీకగా నిలుస్తున్నాయని కొనియాడారు.పెద్ద ఎత్తున మహిళలు,యువతులు, యువకులు, అందరూ కలిసి గిరిజనులు సాంప్రదాయ వేషాధారణలో ప్రత్యేక పూజలు చేసి ఘనంగా నిర్వహించారు.లంబాడ గిరిజనుల కుల దేవతకు తొమ్మిది రోజుల పాటు ప్రత్యేక పూజలు చేసి మహిళలు, యువతులు సాంప్రదాయ నృత్యాలు చేసి తమ భక్తిని చాటుకున్నారు. బంజారా,లంబాడీ సంస్కృతి సాంప్రదాయానికి చాటి చెప్పే పండుగలలో అతి ముఖ్యమైనది తీజ్ పండుగ.తీజ్ అనగా గోధుమ మొలకలు అని అర్థం.ఈ పండుగను పెళ్ళి కాని అమ్మాయిలు శ్రావణ మాసంలో భక్తి శ్రద్ధలతో తొమ్మిది రోజులు అత్యంత వైభవంగా జరుపుకుంటారని తెలిపారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ మేకల రజితదేవేందర్ రెడ్డి,స్థానిక కౌన్సిలర్లు,జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ భాస్కర్ యాదవ్, బి ఆర్ ఎస్ సీనియర్ నేతలు రాజ మల్లారెడ్డి, భాగ్యరెడ్డి గుండ్ల పోచంపల్లి మాజీ సర్పంచ్ మద్దుల శ్రీనివాస్ రెడ్డి,మాజీ కో ఆప్షన్ సభ్యుడు అకిటి నవీన్ రెడ్డి,మాజీ వైస్ ఎంపీపీ గోపని వెంకటేష్,బీజేపీ ఎల్లంపేట మున్సిపాలిటీ అధ్యక్షులు శ్రీశైలం యాదవ్ జగన్ రెడ్డి,కత్తి సురేందర్,యూనిస్ పాషా తదితరులు పాల్గొన్నారు.

# బోనాల పండుగ శాంతియుతంగా జరుపుకోవాలని : ఏసీపి శశాంక్ రెడ్డి





**తార్నాక (ప్రశ్న న్యూస్)** బోనాలు పండుగ సందర్భంగా లాలాగూడ పోలీస్ స్టేషన్ పరిధిలో ఉన్న అన్ని టెంపుల్స్ యొక్క నిర్వాహకులు, పెద్దలతో లాలగూడా పోలీస్ స్టేషన్ లో గురువారం సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో బోనాల పండుగ సందర్భంగా తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి ఆర్గనైజర్స్ కు సూచనలు చేశారు. నిర్వాహకులు కూడా కొన్ని సూచనలు ఇవ్వడం జరిగింది. లాలాగూడలో నిర్వహించబోయే బోనాల పండుగ సందర్భంగా ప్రతి టెంపుల్ వద్ద పోలీసు బందోబస్తు ఏర్పాటు చేస్తామన్నారు. పలహారం బండ్ల ఊరేగింపు సందర్భంలో డీజే లకు అనుమతి లేదని ఆర్గనైజర్స్ ఫలహారం బండ్ల ఊరేగింపుకు బాధ్యత వహించవలసిన అవసరం ఉంటుందని రాత్రి పది గంటల తర్వాత సౌండ్ పొల్యూషన్ లేకుండా చూసుకొనవలెను, ఏవైనా చిన్న చిన్న సంఘటనలను జరిగిన చో ఆర్గనైజర్స్ వాటిని అక్కడికక్కడే పరిష్కరించవలెను. పోలీసు శాఖ తరపున ప్రజలకు అసౌకర్యం జరగకుండా చర్యలు తీసుకుంటామని నిర్వాహకులు గాని, ప్రజలు కానీ ఏదైనా ఇబ్బందులు ఉంటే ముందే పోలీసు వారికి తెలియజేస్తే సమస్యలను పరిష్కరించడానికి అవకాశం ఉంటుందన్నారు. ప్రజలు బోనాల పండుగ సందర్భంగా పోలీస్ శాఖతో సహకరించవలసిందిగా విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశానికి లాలాగూడ ఇన్స్పెక్టర్ రవి కిరణ్, ఎస్ఐ అమర్ సింగ్ సిబ్బంది, స్థానిక నాయకులు పాలకూర శ్రీనివాస్ గౌడ్, సునీల్ ముదిరాజ్, హంసరాజ్, కిషోర్ యాదవ్, మల్లికార్జున్, అమర్, మహేష్, ప్రవీణ్ వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

# డీఎస్సీ అక్రమాలపై సీబీఐ విచారణ జరపాలి

- చిలకలూరిపేటలో వైఎస్సార్సీపీ రిలే నిరాహార దీక్ష
- అభ్యర్థులకు న్యాయం చేయాలని డిమాండ్







**చిలకలూరిపేట(ప్రశ్న న్యూస్)** డీఎస్సీ-2025 నియామకాల్లో జరిగినట్లు ఆరోపిస్తున్న అక్రమాలపై సమగ్ర సీబీఐ విచారణ జరిపి అభ్యర్థులకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో గురువారం చిలకలూరిపేటలో నిర్వహించిన 'ఏపీ జెన్-జెడ్ వార్' రిలే నిరాహార దీక్షలో మాజీ మంత్రి విడదల రజిని పాల్గొన్నారు. నిరుద్యోగ యువత, డీఎస్సీ అభ్యర్థులు, విద్యార్థులతో కలిసి ఆమె దీక్షలో కూర్చొని ప్రభుత్వానికి వ్యతిరేకంగా నిరసన వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా విడదల రజిని మాట్లాడుతూ, డీఎస్సీ నియామక ప్రక్రియపై రాష్ట్రవ్యాప్తంగా వేలాది మంది అభ్యర్థులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నప్పటికీ ప్రభుత్వం వాటిని పట్టించుకోవడం లేదని ఆరోపించారు. పారదర్శకంగా ఉండాల్సిన నియామక ప్రక్రియ వివాదాస్పదంగా మారడం దురదృష్టకరమని అన్నారు. అభ్యర్థుల భవిష్యత్తుతో ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని విమర్శించారు.డీఎస్సీ-2025లో చోటు చేసుకున్నట్లు చెబుతున్న అక్రమాలపై సీబీఐతో సమగ్ర విచారణ జరిపి వాస్తవాలను వెలుగులోకి తీసుకురావాలని ఆమె డిమాండ్ చేశారు. విచారణ పూర్తయ్యే వరకు సంబంధిత నియామక ప్రక్రియపై ప్రభుత్వం పునరాలోచన చేయాలని కోరారు. అక్రమాలకు పాల్పడిన అధికారులు, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని, ఎలాంటి రాజకీయ జోక్యం లేకుండా విచారణ జరగాలని అన్నారు.డీఎస్సీ వ్యవహారంలో నైతిక బాధ్యత వహిస్తూ విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ తన పదవికి రాజీనామా చేయాలని విడదల రజిని డిమాండ్ చేశారు. విద్యార్థులు, నిరుద్యోగ యువతలో నెలకొన్న అనుమానాలను నివృత్తి చేయకుండా ప్రభుత్వం ముందుకు వెళ్లడం సరైన విధానం కాదన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి అభ్యర్థులకు న్యాయం చేయాలని కోరారు.అంతేకాకుండా రాష్ట్రంలో వేలాది మంది విద్యార్థులు ఎదురుచూస్తున్న ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు ప్రతి నిరుద్యోగికి నెలకు రూ.3 వేల నిరుద్యోగ భృతిని అమలు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. ఎన్నికల హామీలను అమలు చేయకుండా యువతను నిరాశపరచడం తగదన్నారు.దీక్షలో పాల్గొన్న నిరుద్యోగ యువత, డీఎస్సీ అభ్యర్థులు ప్రభుత్వం తమ ఆవేదనను గుర్తించి న్యాయం చేయాలని కోరారు. నియామక ప్రక్రియపై ఉన్న సందేహాలను నివృత్తి చేస్తూ పూర్తి పారదర్శకతతో వ్యవహరించాలని విజ్ఞప్తి చేశారు.విద్యార్థుల ఆశలు నెరవేరే వరకు, నిరుద్యోగ యువతకు న్యాయం జరిగే వరకు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పోరాటం కొనసాగుతుందని వైఎస్సార్సీపీ నాయకులు స్పష్టం చేశారు. రాష్ట్రవ్యాప్తంగా చేపట్టిన రిలే నిరాహార దీక్షల్లో భాగంగానే చిలకలూరిపేట కార్యక్రమం నిర్వహించినట్లు తెలిపారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, విద్యార్థులు, నిరుద్యోగ యువత పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# వరుణయాగ సహిత సహస్ర ఘటాభిషేకానికి దేవదాయశాఖ మంత్రి కి ఆహ్వానం

- పలికిన ఈఓ శ్రీనివాస్, చైర్మన్ రమేష్ నాయుడు



శ్రీశైలం (ప్రశ్నన్యూస్) సకాలంలో తగినంత వర్షాలు కురిసి పంటలు బాగా పండి రాష్ట్రం సశ్యశ్యామలంగా ఉండాలనే సంకల్పంతో తేది 07 నుండి 11 వరకు 5 రోజులపాటు వరుణయాగసహిత సహస్ర ఘటాభిషేకాన్ని దేవస్థానం నిర్వహిస్తోంది.ఈ సందర్భంగా గౌరవ దేవదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి కి ధర్మకర్తల మండలి అధ్యక్షులు పోతుగుంట రమేష్‌నాయుడు, కార్యనిర్వహణాధికారి యం.శ్రీనివాసరావు, ధర్మకర్తల మండలి సభ్యులు ఎ.వి.రమణ,వేదపండితులు ఆహ్వాన పత్రికతో వరుణయాగ సహిత సహస్ర ఘటాభిషేకానికి ఆహ్వానించడం జరిగింది. ఈ కార్యక్రమములో దేవదాయశాఖ మంత్రి వారికి వేద ఆశీర్వచనంతో పాటు శేషవస్త్రాలు, ప్రసాదాలను అందజేయడం జరిగింది.

# శ్రీగిరిపల్లిలో తల్లిపాలు వారోత్సవాలు

**- గర్భిణులు, బాలింతలకు అవగాహన కల్పించిన హంస హోమియోపతి మెడికల్ కాలేజ్ విద్యార్థులు**



**గజ్వేల్ ( ప్రశ్న న్యూస్)** సిద్దిపేట జిల్లా గజ్వేల్ మండలం శ్రీగిరిపల్లి గ్రామంలో హంస హోమియోపతి మెడికల్ కాలేజ్, ఐసీపీఎస్ ఆధ్వర్యంలో గురువారం తల్లిపాలు వారోత్సవాలను నిర్వహించారు.ఈ సందర్భంగా హంస హోమియోపతి మెడికల్ కాలేజ్ విద్యార్థులు స్కిట్ ప్రదర్శించి, తల్లిపాల ప్రాముఖ్యత, శిశువుకు సరైన విధంగా తల్లిపాలు ఇవ్వాల్సిన పద్ధతి, గర్భిణులు మరియు బాలింతలు తీసుకోవాల్సిన పోషకాహారం గురించి అవగాహన కల్పించారు.అంగన్‌వాడీ సూపర్వైజర్ సౌజన్య మాట్లాడుతూ తల్లిపాలు ఇవ్వడం వల్ల తల్లికి, శిశువుకు కలిగే ఆరోగ్య ప్రయోజనాలను వివరించారు.

పుట్టిన వెంటనే శిశువుకు తల్లిపాలు అందించడం ద్వారా రోగనిరోధక శక్తి పెరగడంతో పాటు ఆరోగ్యకరమైన ఎదుగుదలకు దోహదపడుతుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ కల్పన, గ్రామ కార్యదర్శి వేణు, 8వ వార్డు సభ్యుడు వెంకట్ ముదిరాజ్, జీపీఓ అనిత, అంగన్‌వాడీ టీచర్లు నిర్మల, పద్మజ, రమ, ఆశా కార్యకర్తలు, ఆయాలు, గర్భిణులు, బాలింతలు పాల్గొన్నారు.హంస హోమియోపతి మెడికల్ కాలేజ్ నుంచి డాక్టర్ ఆశ, సంగీతతో పాటు విద్యార్థులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## ప్రొఫెసర్ జయశంకర్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించిన నర్సాపూర్ పూరపాలక సంఘం కమిషనర్ చెరుకు సాయికుమార్




మెదక్ ప్రతినిధి (ప్రశ్న న్యూస్ ) నర్సాపూర్ పురపాలక సంఘం కార్యాలయంలో ప్రొఫెసర్ జయశంకర్ చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించిన నర్సాపూర్ మున్సిపల్ కమిషనర్ చెరుకు సాయికుమార్ ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రొఫెసర్ ఆచార్య జయశంకర్ 92వ జయంతి మున్సిపల్ కార్యాలయం సిబ్బందితో కలిసి ఘనంగా నివాళులర్పించారు తెలంగాణ ఉద్యమానికి సిద్ధాంతం దిశ నిర్దేశం చేసిన మహోన్నత వ్యక్తి జయశంకర్ తెలంగాణ రాష్ట్రం కోసం తన జీవితాన్ని త్యాగం చేసిన ఉద్యమ చివరి శ్వాస వరకు అండగా నిలిచారని నర్సాపూర్ మున్సిపల్ కమిషనర్ చెరుకు సాయికుమార్ తెలిపారు ఈ కార్యక్రమంలో నర్సాపూర్ మున్సిపల్ వైస్ చైర్మన్ బుచ్చేష్ యాదవ్ మున్సిపల్ మేనేజర్ వైట్ల మధుసూదన్, వార్డు సభ్యులు మున్సిపల్ అధికారులు విష్ణు, తదితరులు పాల్గొన్నారు.

# అంతర్‌రాష్ట్ర వాహన దొంగ అరెస్ట్

**- 10 లక్షల విలువైన కార్లు, బైక్ స్వాధీనం**

**- బి పోలీస్ కమిషనర్ రష్మీ పెరుమాళ్,ఐపీఎస్**



**సిద్దిపేట( ప్రశ్న న్యూస్ )** సిద్దిపేట పోలీస్ కమిషనరేట్ పరిధిలోని కుకునూరుపల్లి పోలీసులు అంతర్‌రాష్ట్ర వాహన దొంగను అరెస్ట్ చేసి, సుమారు రూ.10 లక్షల విలువైన రెండు కార్లు, ఒక బైక్‌ను స్వాధీనం చేసుకున్నారు.పోలీసుల వివరాల ప్రకారం, నాగర్‌కర్నూల్ జిల్లా బిజినేపల్లి మండలం ఖానాపూర్ గ్రామానికి చెందిన పెండ్యాల సుదర్శన్ (32) అలవాటుపడిన వాహన చోరుడు. ఒంటరిగా ప్రయాణించే క్యాబ్ డ్రైవర్లను లక్ష్యంగా చేసుకుని, ఎక్కువ డబ్బులు ఇస్తానని నమ్మించి దూర ప్రాంతాలకు బుక్ చేసుకునేవాడు. ప్రయాణ మధ్యలో నిర్మానుష్య ప్రాంతాల్లో కారు ఆపించి, డ్రైవర్ బయటకు వెళ్లగానే వాహనాన్ని తీసుకుని పరారయ్యేవాడు.ఈ కేసులో వికారాబాద్ జిల్లా భోంరాస్‌పేట మండలానికి చెందిన ఓలా క్యాబ్ డ్రైవర్ అంగోత్ తుల్జా ఫిర్యాదు మేరకు కుకునూరుపల్లి పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. ఎల్‌బీనగర్ నుంచి కొమురవెల్లి దర్శనానికి వెళ్లిన అనంతరం, కుకునూరుపల్లి సమీపంలో డ్రైవర్ కారు దిగిన సమయంలో స్విఫ్ట్ డిజైర్ కారును నిందితుడు అపహరించాడు.ఏసీపీ నర్సింలు పర్యవేక్షణలో సీఐ లతీఫ్, ఎస్ఐ బాలకృష్ణ ఆధ్వర్యంలో పోలీసులు సీసీటీవీ ఫుటేజీ, సాంకేతిక ఆధారాల సహాయంతో నిందితుడిని అరెస్ట్ చేశారు.నిందితుడి వద్ద నుంచి స్వాధీనం చేసుకున్న వాహనాలు:స్విఫ్ట్ డిజైర్ కారు ( టీఎస్ 34 ఎదీ 7506) టోయోటా ఎటియోస్ కారు (ఏపీ 31 టీపీ 2556)రాయల్ ఎన్‌ఫీల్డ్ హంటర్ బైక్ (టీఎస్ 04 ఎఫ్ జె 6045)మొత్తం రూ.10 లక్షల విలువైన ఈ వాహనాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.విచారణలో నిందితుడు గతంలో గజ్వేల్, నర్సింగి, ఎస్ఆర్ నగర్, చైతన్యపురి, ఖమ్మం, భద్రాచలం, మలకపేట, నకిరేకల్ తదితర పోలీస్ స్టేషన్ల పరిధిలో వాహన దొంగతనాలకు పాల్పడినట్లు అంగీకరించాడు. జైలులో పరిచయమైన నేరస్థులతో కలిసి దొంగిలించిన వాహనాలను తక్కువ ధరకు విక్రయించినట్లు కూడా వెల్లడించాడు.నిందితుడిని న్యాయస్థానంలో హాజరుపర్చి జ్యుడీషియల్ రిమాండ్‌కు తరలించారు. కేసును ఛేదించి నిందితుడిని అరెస్ట్ చేసిన సీఐ లతీఫ్, ఎస్ఐ బాలకృష్ణ, ఐటీ కోర్ కానిస్టేబుల్ శ్రీకాంత్‌తో పాటు కేసు దర్యాప్తులో పాల్గొన్న పోలీసు సిబ్బందిని పోలీస్ కమిషనర్ రష్మీ పెరుమాళ్, ఐపీఎస్ అభినందించారు.

# కో-ఆపరేటివ్ స్టోర్స్‌లో 'అధికారం' ఎవరిది.?

**- అవుట్‌సోర్సింగ్ ఉద్యోగిపై వరుస ఆరోపణలు**

**- ఫిర్యాదులున్నా చర్యలు శూన్యం..?**

**- వినియోగదారుల అసంతృప్తి, పాలకవర్గం మౌనంపై ప్రశ్నలు**




**ఇబ్రహీంపట్నం(ప్రశ్న న్యూస్)** ఎన్టీఆర్ జిల్లా ఇబ్రహీంపట్నంలోని వీటీపీఎస్ కో-ఆపరేటివ్ స్టోర్స్‌లో ఓ అవుట్‌సోర్సింగ్ ఉద్యోగి వ్యవహార శైలిపై వినియోగదారుల నుంచి తీవ్ర అసంతృప్తి వ్యక్తమవుతోంది. విధుల్లో నిర్లక్ష్యం, కేటాయించిన బాధ్యతలను నిర్వర్తించకుండా ఇతర ఉద్యోగులపై పనిభారం మోపడం, వినియోగదారులను నిరీక్షింపజేయడం వంటి ఆరోపణలు వినిపిస్తున్నాయి. గతంలో కూడా ఇదే ఉద్యోగిపై ఫిర్యాదులు వచ్చినప్పటికీ ఇప్పటివరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి.వినియోగదారుల కథనం ప్రకారం, సదరు ఉద్యోగి తనకు కేటాయించిన కౌంటర్ వద్ద విధులు నిర్వహించకుండా గంటల తరబడి ఇతర ప్రాంతాల్లో గడుపుతూ, తన పని ఇతర కౌంటర్ల సిబ్బందితో చేయిస్తున్నారని ఆరోపిస్తున్నారు. దీంతో కౌంటర్ వద్దకు వచ్చే వినియోగదారులు తీవ్ర ఇబ్బందులు పడటంతో పాటు స్టోర్స్ సేవలు ఆలస్యమవుతున్నాయని చెబుతున్నారు.అంతేకాకుండా విధి నిర్వహణకు బదులుగా ఇతర సిబ్బందితో సమావేశాలు నిర్వహిస్తూ ఎక్కువ సమయం గడుపుతున్నారని, దీని వల్ల వ్యాపార లావాదేవీలపై కూడా ప్రతికూల ప్రభావం పడుతోందని పలువురు వినియోగదారులు వాపోతున్నారు. కౌంటర్ వద్ద సిబ్బంది అందుబాటులో లేకపోవడంతో కొనుగోళ్ల కోసం వచ్చిన వారు నిరీక్షించాల్సిన పరిస్థితి ఏర్పడుతోందని పేర్కొంటున్నారు.ఈ ఉద్యోగిపై గతంలో వీటీపీఎస్ క్యాంటీన్ నిర్వాహకుడు కూడా ఫిర్యాదు చేసినట్లు సమాచారం ఉన్నప్పటికీ, ఆ ఫిర్యాదులపై ఎలాంటి క్రమశిక్షణ చర్యలు తీసుకోలేదనే ప్రచారం జరుగుతోంది. అప్పట్లో వచ్చిన ఆరోపణలు, ప్రస్తుతం వినిపిస్తున్న ఫిర్యాదులు ఒకే తరహాలో ఉండడం చర్చనీయాంశంగా మారింది.గత రెండు రోజులుగా ఈ వ్యవహారంపై సామాజిక మాధ్యమాలు, వాట్సాప్ గ్రూపుల్లో విస్తృతంగా చర్చ జరుగుతున్నప్పటికీ, కొత్త పాలకవర్గం స్పందించలేదని వినియోగదారులు ఆరోపిస్తున్నారు. సదరు ఉద్యోగిపై చర్యలు తీసుకోవడంలో పాలకవర్గం వెనుకంజ వేస్తోందా? లేక మరేదైనా కారణం ఉందా? అనే ప్రశ్నలు వినిపిస్తున్నాయి.స్టోర్స్‌లో క్రమశిక్షణ, బాధ్యతాయుతమైన సేవలు అందించడం పాలకవర్గం బాధ్యత అని వినియోగదారులు పేర్కొంటున్నారు. ఆరోపణలు నిజమైతే వెంటనే విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని, ఆరోపణలు నిరాధారమైతే వాటిని కూడా అధికారికంగా ఖండించి వాస్తవాలను వెల్లడించాలని కోరుతున్నారు.వినియోగదారులు ఈ వ్యవహారంపై లిఖితపూర్వక ఫిర్యాదు చేసి పాలకవర్గం, మేనేజ్‌మెంట్ దృష్టికి తీసుకెళ్లాలని భావిస్తున్నట్లు సమాచారం. అవసరమైతే సహకార శాఖ ఉన్నతాధికారులకు కూడా ఫిర్యాదు చేసేందుకు సిద్ధమవుతున్నట్లు తెలుస్తోంది.

# ఇంద్రకీలాద్రిపై అభివృద్ధి పనుల పరిశీలన

**- భక్తులకు మెరుగైన సౌకర్యాలపై దృష్టి**

**- నిర్ణీత గడువులో పనులు పూర్తి చేయాలని ఆదేశం**



విజయవాడ(ప్రశ్న న్యూస్) ఇంద్రకీలాద్రిపై భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించే లక్ష్యంతో చేపడుతున్న పలు అభివృద్ధి పనులను శ్రీ దుర్గామల్లేశ్వర స్వామివార్ల దేవస్థానం కార్యనిర్వహణాధికారి వి.కె. శీనా నాయక్, ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ బొర్రా రాధాకృష్ణ గురువారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. వివిధ నిర్మాణ పనుల పురోగతిని తనిఖీ చేసి ఇంజినీరింగ్ అధికారులకు పలు సూచనలు చేశారు.

ఈ సందర్భంగా శ్రీ సుబ్రహ్మణ్యస్వామి ఆలయం నుంచి ఘాట్‌రోడ్డు వైపు వెళ్లే మార్గంలో భక్తుల రాకపోకలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చేపడుతున్న కాలిబాట విస్తరణ పనులను పరిశీలించారు. రద్దీ సమయాల్లో భక్తులు సులభంగా రాకపోకలు సాగించేలా పనులను నాణ్యతతో పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.టికెట్ స్కానింగ్ కేంద్రం వద్ద భక్తుల రద్దీని నియంత్రించేందుకు చేపడుతున్న క్యూలైన్ల క్రమబద్ధీకరణ ఏర్పాట్లను కూడా పరిశీలించారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా రద్దీ నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు.కొండపై నిర్మిస్తున్న నూతన ప్రసాద తయారీ కేంద్రం (ప్రసాదం పోటు), అన్నప్రసాద భవన నిర్మాణ పనుల పురోగతిని క్షుణ్ణంగా పరిశీలించారు. నిర్మాణ పనులను వేగవంతం చేసి నిర్ణీత గడువులోగా పూర్తి చేసి భక్తులకు అందుబాటులోకి తీసుకురావాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.భక్తుల అవసరాలను దృష్టిలో ఉంచుకుని ఆలయంలో చేపడుతున్న ప్రతి అభివృద్ధి పనిలో నాణ్యతకు ప్రాధాన్యం ఇవ్వాలని, భవిష్యత్ అవసరాలను కూడా దృష్టిలో పెట్టుకుని నిర్మాణాలు చేపట్టాలని ఈ సందర్భంగా సూచించారు.ఈ క్షేత్రస్థాయి పరిశీలనలో దేవస్థానం ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఎల్. రమాదేవి, ఇంజినీరింగ్ అధికారులు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

# సేవా కార్యక్రమాలతో గళ్ళా మాధవి జన్మదినం

**- నియోజకవర్గవ్యాప్తంగా మొక్కల నాటకం,**

**- రక్తదానం, అన్నదానం, అవయవదాన ప్రతిజ్ఞలు**



గుంటూరు(ప్రశ్న న్యూస్) గుంటూరు పశ్చిమ ఎమ్మెల్యే, టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యురాలు గళ్ళా మాధవి జన్మదినాన్ని పార్టీ శ్రేణులు సేవా కార్యక్రమాలతో ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్యే పిలుపు మేరకు నియోజకవర్గంలోని వివిధ డివిజన్లలో మొక్కల నాటకం, రక్తదాన శిబిరాలు, అన్నదానం, పండ్ల పంపిణీ, అవయవదాన ప్రతిజ్ఞ, విద్యార్థులకు విద్యా సామగ్రి పంపిణీ వంటి కార్యక్రమాలు చేపట్టారు.ఈ సందర్భంగా నియోజకవర్గవ్యాప్తంగా సుమారు 2,500 మొక్కలను కాలనీలు, పార్కులు, ప్రభుత్వ కార్యాలయాలు, విద్యాసంస్థలు, ప్రధాన రహదారుల వెంట నాటారు. మొక్కల సంరక్షణ బాధ్యతలను స్థానిక నాయకులు స్వీకరించారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు, మహిళలు, యువత, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.టీడీపీ నియోజకవర్గ కార్యాలయంలో సుఖవాసి శ్రీనివాసరావు, ఎస్టీ సెల్ ప్రధాన కార్యదర్శి పేరం శ్రీను ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి ఎమ్మెల్యేకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. 22వ డివిజన్ యూనిట్ ఇన్‌చార్జి సయ్యద్ చాంద్ ఆధ్వర్యంలో నిర్వహించిన రక్తదాన శిబిరంలో యువత స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. తెలుగు మహిళల ఆధ్వర్యంలో ఆసుపత్రుల్లో రోగులకు పండ్ల పంపిణీ నిర్వహించారు.మానవత సేవా సమితి ఆధ్వర్యంలో అవయవదానంపై అవగాహన కల్పించి, పలువురితో అవయవదాన ప్రతిజ్ఞ చేయించారు. బీసీ సెల్ ఉపాధ్యక్షుడు గర్నపూడి శివ ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహించగా, ముస్లిం మైనారిటీ నాయకులు దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి ఎమ్మెల్యేకు శుభాకాంక్షలు తెలిపారు. పర్యావరణ పరిరక్షణ, రక్తదానం, అవయవదానం, అన్నదానం వంటి సామాజిక బాధ్యతను ప్రతిబింబించే కార్యక్రమాలు నియోజకవర్గవ్యాప్తంగా నిర్వహించడంతో గళ్ళా మాధవి జన్మదిన వేడుకలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.

# గిరిజన హక్కులకు చట్టబద్ధ రక్షణ కల్పించాలి

**- కేంద్ర హోంమంత్రి అమిత్ షాకు వైఎస్సార్సీపీ ఎంపీల వినతి**

**- జీవో-3కు ప్రత్యామ్నాయ వ్యవస్థ కోరిన తనూజారాణి**



**న్యూఢిల్లీ(ప్రశ్న న్యూస్)** గిరిజనుల విద్య, ఉద్యోగ, ఉపాధి హక్కులకు భంగం కలగకుండా జీవో నెం.3 స్థానంలో చట్టబద్ధమైన ప్రత్యామ్నాయ వ్యవస్థను తీసుకురావాలని, అవసరమైన చట్ట సవరణలు చేపట్టాలని కేంద్ర హోంమంత్రి అమిత్ షాను వైఎస్సార్సీపీ ఎంపీలు గురువారం కోరారు. ఈ మేరకు ఆయనకు వినతిపత్రం సమర్పించారు.అరకు లోక్‌సభ సభ్యురాలు డాక్టర్ గుమ్మ తనూజరాణి మాట్లాడుతూ, జీవో నెం.3, 1/70 చట్టానికి సంబంధించిన అంశాలను కేంద్ర ప్రభుత్వం సమగ్రంగా పరిశీలించి గిరిజనుల రాజ్యాంగబద్ధ హక్కులకు ఎలాంటి భంగం కలగకుండా చట్టబద్ధ పరిష్కారం చూపాలని విజ్ఞప్తి చేశారు. గిరిజన ప్రాంతాల్లో విద్య, ఉద్యోగ అవకాశాల పరిరక్షణకు తగిన చట్ట సవరణలు చేపట్టాల్సిన అవసరం ఉందన్నారు.గిరిజనుల హక్కులను కాపాడేందుకు కేంద్ర ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవాలని, షెడ్యూల్డ్ ఏరియాల్లో స్థానిక గిరిజనులకు రాజ్యాంగం కల్పించిన రక్షణ కొనసాగించేలా ప్రత్యామ్నాయ చట్టపరమైన వ్యవస్థను రూపొందించాలని కోరినట్లు తెలిపారు.ఈ సందర్భంగా గిరిజన ప్రాంతాల్లో ప్రస్తుతం నెలకొన్న పరిస్థితులను హోంమంత్రి దృష్టికి తీసుకెళ్లినట్లు ఎంపీలు వెల్లడించారు. గిరిజనుల సంక్షేమం, ఉపాధి అవకాశాలు, విద్యా హక్కుల పరిరక్షణ విషయంలో కేంద్ర ప్రభుత్వం సానుకూల నిర్ణయం తీసుకుంటుందనే ఆశాభావాన్ని వ్యక్తం చేశారు.ఈ సమావేశంలో వైఎస్సార్సీపీ రాజ్యసభ సభ్యులు వై.వి. సుబ్బారెడ్డి, మేడ రఘునాథ్ రెడ్డి, గొల్ల బాబూరావు, లోక్‌సభ సభ్యులు పెద్దిరెడ్డి వెంకట మిథున్ రెడ్డి, వైఎస్ అవినాష్ రెడ్డి, మద్దెల గురుమూర్తి తదితరులు పాల్గొన్నారు.


# ప్రాజెక్టులు చూసే నైతిక హక్కు వైసీపీకి లేదు

**- రాయలసీమ ప్రాజెక్టులపై రాజకీయాలు మానుకోవాలి: కాలవ శ్రీనివాసులు**



మంగళగిరి(ప్రశ్న న్యూస్)రాయలసీమ సాగునీటి ప్రాజెక్టుల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం వేగంగా చర్యలు చేపడుతుంటే, వైసీపీ నాయకులు ప్రాజెక్టుల సందర్శనల పేరుతో రాజకీయ నాటకాలకు తెరలేపుతున్నారని టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు కాలవ శ్రీనివాసులు విమర్శించారు. మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో గురువారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు.రాయలసీమ ప్రాజెక్టులను సందర్శించే నైతిక హక్కు వైసీపీ నాయకులకు లేదని ఆయన అన్నారు. ఐదేళ్ల అధికారంలో ఉన్నప్పుడు హంద్రీ--నీవా, గాలేరు--నగరి వంటి కీలక ప్రాజెక్టులను పట్టించుకోకుండా ఇప్పుడు ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. 2014--19 మధ్య టీడీపీ ప్రభుత్వం రాయలసీమ ప్రాజెక్టులపై రూ.12,500 కోట్ల వ్యయం చేయగా, వైసీపీ హయాంలో కేవలం రూ.2,000 కోట్లే ఖర్చు చేశారని పేర్కొన్నారు.రాష్ట్ర విభజన సమయంలో కృష్ణా జలాల పంపకంలో ఆంధ్రప్రదేశ్‌కు 512 టీఎంసీల వాటా సాధించడంలో చంద్రబాబు కీలక పాత్ర పోషించారని కాలవ శ్రీనివాసులు పేర్కొన్నారు. అలాగే రాయలసీమ పండ్ల తోటల రైతులకు కీలకమైన బిందు సేద్యం పథకాన్ని గత ప్రభుత్వం నిర్లక్ష్యం చేసిందని, ప్రస్తుతం మళ్లీ ఆ పథకానికి ఊతమిస్తున్నామని చెప్పారు.రాయలసీమలో పారిశ్రామికాభివృద్ధితో పాటు సాగునీటి రంగానికీ ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందని, లక్ష కోట్ల రూపాయల పెట్టుబడులతో ఉద్యానవన రంగాన్ని అభివృద్ధి చేసే దిశగా చర్యలు తీసుకుంటోందని తెలిపారు. వైసీపీ పాలనలో రాయలసీమకు నష్టం తప్ప ప్రయోజనం చేకూరలేదని, ప్రస్తుతం ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలకు ప్రజలు మద్దతు ఇస్తున్నారని కాలవ శ్రీనివాసులు అన్నారు.

# 'గట్టా కుస్తీ 2' మూవీ రివ్యూ!



విష్ణు విశాల్ – ఐశ్వర్య లక్ష్మి ప్రధానమైన పాత్రలను పోషించిన 'గట్టా కుస్తీ' 2022లో థియేటర్లకు వచ్చింది. తమిళంలో రూపొందిన ఈ సినిమా, 30 కోట్లకు పైగా వసూళ్లను రాబట్టింది. చెల్లా అయ్యావు దర్శకత్వం వహించిన ఈ సినిమాకి సీక్వెల్ గా 'గట్టా కుస్తీ 2' నిర్మితమైంది. తమిళంలో జులై 3వ తేదీన విడుదలైన ఈ సినిమా, 50 కోట్లకు పైగా వసూళ్లను రాబట్టింది. అలాంటి ఈ సినిమా 'నెట్ ఫ్లిక్స్'లో జులై 31 నుంచి అందుబాటులోకి వచ్చింది. తమిళంతో పాటు వివిధ భాషల్లో స్ట్రీమింగ్ అవుతోంది.వీర (విష్ణు విశాల్) తన భార్య కీర్తి (ఐశ్వర్య లక్ష్మీ)ని రెజ్లింగ్ ఛాంపియన్ ను చేస్తానంటూ ఇచ్చిన మాటను నిలబెట్టుకుంటాడు. ఒక వైపున జాబ్ చేస్తూనే మరో వైపున ఆమె కుస్తీ పోటీలలో చురుకుగా పాల్గొంటూ విజయాలను అందుకుంటూ ఉంటుంది. వీర తమ కూతురు 'మది' (జరా)ను జాగ్రత్తగా చూసుకుంటూ, ఇంటి వ్యవహారాలను చక్కబెడుతూ ఉంటాడు. అపార్టుమెంటులోని లేడీస్ తో కలుపుగోలుగా మాట్లాడుతూ, వాళ్ల భర్తలకు మనఃశాంతి లేకుండా చేస్తుంటాడు. 'వీర' చేసిన గారం కారణంగా 'మది' చదువులో వెనకబడుతుంది. అంతే కాకుండా తన క్లాస్ పిల్లలతో గొడవపడుతూ ఉంటుంది. ఈ విషయంలో ప్రిన్సిపల్ చీవాట్లు పెడుతున్న విషయం కీర్తికి తెలియకుండా అతను జాగ్రత్తపడుతూ ఉంటాడు. ఈ నేపథ్యంలోనే ఒకానొక సందర్భంలో కీర్తి మంత్రిగారి చేతుల మీదుగా అవార్డును అందుకుంటుంది. తన ఎదుగుదలకు కారణం తన భర్త అంటూ ఆ సందర్భంలో ఆమె మాట్లాడుతుంది. కీర్తి కోచ్ (తారక్ పొన్నప్ప)కి అది ఎంతమాత్రం నచ్చదు. దాంతో కీర్తిని దెబ్బతీయాలని అతను నిర్ణయించుకుంటాడు.'మది'ని కూడా రెజ్లర్ ను చేయాలనే కీర్తి ఆలోచనకు 'వీర' అడ్డు చెబుతాడు. దాంతో వాళ్లిద్దరి మధ్య మాటామాట పెరుగుతుంది. కీర్తి కోపాన్ని నియంత్రిచడం అవసరమనీ, ఆమెకి తెలియకుండా ఆమెతో వాడించమని 'వీర'కి ఒక మెడిసిన్ ను ఇప్పిస్తాడు కోచ్. అతను చెప్పినట్టే 'వీర' చేయడం వలన, ఆ తరువాత జరిగిన గేమ్ లో కీర్తి ఓడిపోతుంది. అంతేకాదు ఆమె మాదక ద్రవ్యాలు వాడినట్టుగా రిపోర్టు వస్తుంది. జరిగిన దానికి తన భర్తనే కారణమని భావించిన కీర్తి ఏం చేస్తుంది? ఆమె నిర్ణయం ఎలాంటి పరిణామాలకి దారితీస్తుంది? కోచ్ కుట్ర బయటపడుతుందా? అనేది కథ.భార్యాభర్తలకు ఒకరిపట్ల ఒకరికి ఎంతో ప్రేమ ఉంటుంది. అయితే పిల్లలు పుట్టిన తర్వాత ఇద్దరి ప్రేమ పిల్లలపైకి వెళుతుంది. వాళ్ల భవిష్యత్తును గురించే ఇద్దరూ ఆలోచన చేయడం మొదలుపెడతారు. అయితే అందుకు అవసరమైన మార్గాన్ని ఎంచుకునే విషయంలో గొడవపడితే ఎలా ఉంటుంది? ప్రేమతో చేసిన పని ద్వేషానికి కారణమైతే ఏం జరుగుతుంది? అలాంటి భార్యాభర్తల వలన పిల్లలు మానసికంగా ఎంత సంఘర్షణను అనుభవిస్తారనే అంశం చుట్టూ అల్లుకున్న కథ ఇది. భార్యాభర్తలు తమ జీవన ప్రయాణంలో ఒకరి కోసం ఒకరు ఎన్నో త్యాగాలు చేయవలసి ఉంటుంది. అయితే ఒక్కోసారి అతి ప్రేమ కూడా మనస్పర్థలకు కారణమవుతుంది. అతి ప్రేమ అపార్థాలకు కూడా దారితీస్తుంది. ఈ పాయింట్ ను టచ్ చేస్తూనే ఈ కథ ముందుకు వెళుతుంది. నిజమైన ప్రేమ ముందు ఎలాంటి సమస్యలైనా మబ్బు తెరల మాదిరిగా తొలగిపోతాయనే విషయాన్ని నిరూపిస్తుంది. విడాకుల కోసం భార్యాభర్తల మధ్య కుస్తీపోటీని ఏర్పాటు చేయడం కొత్తగా .. వినోదభరితంగా అనిపిస్తుంది. అనుమానాలు .. అపార్థాలు .. కీచులాటలు .. ఇరువైపులా గల కుటుంబ పెద్దల స్వభావాలను దర్శకుడు చాలా సహజంగా మలుస్తూ వెళ్లాడు. ఎవరు ఎన్ని అనుకున్నా భార్య లక్ష్యం నెరవేరడం కోసం అవమానాలు భరిస్తూ వెళ్లే భర్త పాత్ర .. ఆ పాత్రను డిజైన్ చేసిన తీరు మెప్పిస్తుంది. కుస్తీ అనేది కేవలం పేరు కోసమో .. మెడల్స్ కోసమో కాదు, ఆడపిల్లల ఆత్మరక్షణకు అవసరమనే ఒక సందేశం కూడా ఈ కథలో మనకి కనిపిస్తుంది. విష్ణు విశాల్ నటన .. ఐశ్వర్య లక్ష్మీ అభినయం ఆకట్టుకుంటాయి.

ఈ ఇద్దరి కూతురుగా నటించిన బేబీ జరా జయనా మంచి మార్కులు కొట్టేస్తుంది. విశాలమైన కళ్లతో ఆ పాప పలికించిన హావభావాలు అలా గుర్తుండిపోతాయి. ఆ పాపకి మంచి భవిష్యత్తు ఉందని చెప్పచ్చు. భాస్కరన్ ఫొటోగ్రఫీ .. సీన్ రోల్డన్ నేపథ్య సంగీతం .. భరత్ విక్రమన్ ఎడిటింగ్ కథను సపోర్టు చేస్తూ సాగుతాయి.లవ్ .. రొమాన్స్ .. కామెడీ .. ఫ్యామిలీ ఎమోషన్స్ తో కూడిన ఈ కథ, ఫ్యామిలీ ఆడియన్స్ ను అలరిస్తుందని చెప్పచ్చు.

# మేఘన ఆచూకీ కోసం..



రామ్ కార్తీక్, అమ్ము అభిరామి, వైదిక సెంజాలియా, అంకిత్ కొయ్య ప్రధాన పాత్రల్లో నటిస్తున్న చిత్రం 'మిస్సింగ్ మేఘన'. వాచస్పతి దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని పంచుమర్తి నరేష్‌బాబు నిర్మిస్తున్నారు. బుధవారం ప్రముఖ దర్శకుడు వి.వి.వినాయక్ ఈ సినిమా టైటిల్‌ను ప్రకటించడంతో పాటు ఫస్ట్‌లుక్‌ని విడుదల చేశారు.పరిశోధాత్మక కథాంశమిదని, ఆద్యంతం సస్పెన్స్‌తో ఆకట్టుకుంటుందని, మేఘన అనే అమ్మాయి ఆచూకీ కోసం జరిగే ప్రయత్నాలు ఉత్కంఠను రేకెత్తిస్తాయి దర్శకుడు వాచస్పతి తెలిపారు. త్వరలో విడుదల తేదీని ప్రకటిస్తామని నిర్మాత నరేష్‌బాబు పేర్కొన్నారు. గోపరాజు రమణ, వెంప కాశి, మహిపాల్, రుచిత తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి కెమెరా: శ్యామ్ కె నాయుడు, సంగీతం: ఆర్.ఆర్.ధృవన్, నిర్మాణ సంస్థ: ఫస్ట్‌కాపీ మూవీస్, కేడీ అండ్ కో, దర్శకత్వం: వాచస్పతి.

# ఓ యోధుడి గాథ 'కరికాల'



సందీప్‌కిషన్ కథానాయకుడిగా నటిస్తున్న తాజా చిత్రానికి 'కరికాల' అనే టైటిల్‌ను ఖరారు చేశారు. 'శంబాల' ఫేమ్ యుగంధర్ ముని దర్శకత్వంలో షైనింగ్ పిక్చర్స్ పతాకంపై మహీధర్ రెడ్డి, రాజశేఖర్ అన్నభీమోజు ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు. బుధవారం టైటిల్ అనౌన్స్‌మెంట్‌తో పాటు ఫస్ట్‌లుక్ పోస్టర్‌ను విడుదల చేశారు. ఇందులో సందీప్‌కిషన్ ఖడ్గాన్ని చేతబూని గుర్రంపై స్వారీ చేస్తూ.. సింహాన్ని వేటాడుతూ ఓ యోధుడి అవతారంలో కనిపిస్తున్నారు. సోషియో ఫాంటసీ అంశాలతో ఈ చిత్రాన్ని రూపొందిస్తున్నట్లు అర్థమవుతున్నది. ఈ సినిమాను రెండు భాగాలుగా తెరకెక్కించబోతున్నామని, తొలి భాగాన్ని వచ్చే ఏడాది జూలై 2న, రెండో భాగాన్ని అక్టోబర్ 28న విడుదల చేయబోతున్నామని మేకర్స్ తెలిపారు. అత్యాధునిక విజువల్ ఎఫెక్ట్స్, అద్భుతమైన కథ, కథనాలతో పాన్ ఇండియా స్థాయిలో ఈ చిత్రాన్ని తెరకెక్కించబోతున్నామని దర్శకుడు పేర్కొన్నారు. ఈ చిత్రానికి సంబంధించిన ఇతర నటీనటులు, సాంకేతిక నిపుణుల వివరాలను త్వరలో వెల్లడించనున్నారు.

# కార్తి జోడీగా?

ప్రస్తుతం తమిళనాడు రాజకీయ పరిణామాలకు కథానాయిక త్రిష కేంద్రబిందువుగా మారింది. మరోవైపు ఆమె రాజకీయాల్లోకి రావాలంటూ అభిమానుల నుంచి ఒత్తిడి పెరుగుతున్నది. అయితే ఈ విషయాలేవీ పట్టించుకోకుండా కొత్త సినిమా సన్నాహల్లో త్రిష బిజీగా ఉంది. తాజా సమాచారం ప్రకారం కార్తి జోడీగా ఈ భామ ఓ సినిమా చేయబోతున్నట్లు తెలిసింది. మోహన్‌రాజా దర్శకత్వంలో కార్తి కొత్త చిత్రాన్ని ఇటీవలే ప్రకటించారు. త్వరలో షూటింగ్ ప్రారంభంకానుంది. ఈ సినిమా కోసం కథానాయిక అన్వేషణలో ఉన్న చిత్రబృందం నయనతార, త్రిష పేర్లను ప్రముఖంగా పరిశీలిస్తున్నట్లు తెలిసింది. నయనతార ప్రస్తు తం వరుస సినిమాలతో బిజీగా ఉండటంతో ఆమె డేట్స్ సర్దుబాటు అయ్యే అవకాశాలు లేవని అంటున్నారు. దాంతో ఈ సినిమాలో త్రిష ను నాయికగా ఖరారు చేయబోతున్నారని చెన్నై సినీ వర్గాల్లో వినిపిస్తున్న ది. 'పొన్నియన్ సెల్వ న్' చిత్రంలో కార్తి-త్రిష జోడీగా నటించారు. ఈ నేపథ్యంలో వీరిద్దరి కాంబినేషన్ అభిమానుల్లో ఆసక్తినిరేకెత్తిస్తున్నది



# మాఫియా డ్రామా 'మకుటం'



హీరో విశాల్ స్వీయ దర్శకత్వంలో మూడు భిన్న పాత్రల్లో కనిపించనున్న యాక్షన్ థ్రిల్లర్ 'మకుటం' ఈ నెల 14న ప్రేక్షకుల ముందుకురానుంది. సముద్రతీర ప్రాంత నేపథ్యంలో ఎత్తుకుపై ఎత్తులతో సాగే గ్యాంగ్‌స్టర్ డ్రామా ఇదని సమాచారం. ప్రముఖ నిర్మాణ సంస్థ సూపర్‌గుడ్ ఫిల్మ్స్ నిర్మిస్తున్న 99వ సినిమా ఇది. ఇప్పటికే విడుదలైన ప్రచార చిత్రాలకు మంచి స్పందన లభించింది. ఈ నెల 7న ట్రైలర్‌ను రిలీజ్ చేయబోతున్నారు. ఈ నేపథ్యంలో బుధవారం కొత్త పోస్టర్‌ను విడుదల చేశారు.ఇందులో విశాల్.. గ్యాంగ్‌స్టర్, ఓల్డ్‌ఏజ్ డాన్, కార్పొరేట్ ఎంప్లాయిగా మూడు భిన్న అవతారాల్లో కనిపిస్తున్నారు. మాఫియా నేపథ్యంలో నడిచే ఈ కథలో విశాల్ పాత్ర చిత్రణ సరికొత్త పంథాలో ఉంటుందని, జీవీ ప్రకాష్‌కుమార్ మ్యూజిక్ హైలైట్‌గా నిలుస్తుందని, భారీ స్థాయిలో విడుదలకు సన్నాహాలు చేస్తున్నామని మేకర్స్ తెలిపారు. దుషార విజయన్, అంజలి, తంబి రామయ్య తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి సంగీతం: జీవీ ప్రకాష్‌కుమార్, కథ: రవి అరసు, నిర్మాత: ఆర్.బి.చౌదరి, దర్శకత్వం: విశాల్.

# నాన్‌స్టాప్ షెడ్యూల్‌లో 'ఫౌజీ'



అగ్ర కథానాయకుడు ప్రభాస్ ప్రస్తుతం 'స్పిరిట్' 'ఫౌజీ' చిత్రాలతో బిజీగా ఉన్నారు. ఇటీవలే ఇటలీ విహారయాత్ర నుంచి తిరిగొచ్చిన ఆయన హైదరాబాద్‌లో జరుగుతున్న 'ఫౌజీ' షూటింగ్‌లో జాయిన్ అయ్యారు. డిసెంబర్ 3న ఈ సినిమా ప్రేక్షకుల ముందుకురానున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో త్వరితగతిన ఈ సినిమా షూట్‌ను పూర్తి చేయాలనే ఆలోచనలో ప్రభాస్ ఉన్నారట. అందుకోసం ఆగస్ట్ నెల మొత్తాన్ని ఈ సినిమాకే కేటాయించారని తెలిసింది. తాజా షెడ్యూల్ నాన్‌స్టాప్‌గా జరుగుతుందని, ప్రభాస్‌పై కొన్ని యాక్షన్ ఘట్టాలతో పాటు కీలక సన్నివేశాలను తెరకెక్కించబోతున్నారని తెలిసింది. 1940 దశకం నాటి స్వాతంత్ర్య సంగ్రామం, రెండో ప్రపంచయుద్ధం తాలూకు ఘటనల నేపథ్యంలో తెరకెక్కిస్తున్న ఈ సినిమాలో ప్రభాస్ సైనికుడి పాత్రలో కనిపించనున్నారు. ఇప్పటికే విడుదలైన ప్రచార చిత్రాలు సినిమాపై భారీ హైప్‌ని క్రియేట్ చేశాయి. ఇమాన్వి, మిథున్‌చక్రవర్తి, అనుపమ్‌ఖేర్, జయప్రద, భానుచందర్ తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి సంగీతం: విశాల్‌చంద్రశేఖర్, నిర్మాణం: మైత్రీ మూవీ మేకర్స్, నిర్మాతలు: నవీన్ యెర్నేని, వై.రవిశంకర్, భూషణ్ కుమార్, రచన-దర్శకత్వం: హను రాఘవపూడి.

# నివాస స్థలాల కోసం వినతిపత్రం అందజేసిన జర్నలిస్టులు




ఎల్లారెడ్డిపేట (ప్రశ్న న్యూస్) జిల్లాలోని జర్నలిస్టులకు అన్ని మండలాలలో నివాస స్థలాలు ప్రభుత్వపరంగా అందజేశారు. ఎల్లారెడ్డిపేట మండలంలో పనిచేస్తున్న జర్నలిస్టులకు ఇప్పటివరకు నివాస స్థలాలు రాలేదు. స్థానిక తహశీల్దార్ సుజాతకు నివాస స్థలాల కోసం వినతి పత్రాన్ని జర్నలిస్టులు అందజేశారు. అన్ని మండలాల్లో పనిచేస్తున్న జర్నలిస్టులకు నివాస స్థలాలు అందజేశారని ఇప్పటికైనా ఎల్లారెడ్డిపేట మండలంలో పనిచేస్తున్న జర్నలిస్టులకు నివాస స్థలాలు అందజేయాలని ప్రభుత్వాన్ని జర్నలిస్టులు కోరారు.

# విద్యార్థుల సమస్యలపై బిజేవైఎం ఆందోళన

**– ఇంటర్, డిగ్రీ కళాశాలల్లో సంతకాల సేకరణ, మిస్డ్ కాల్ రిజిస్ట్రేషన్లు**



సిరిసిల్ల(ప్రశ్న న్యూస్) తెలంగాణ రాష్ట్రంలో విద్యార్థులు ఎదుర్కొంటున్న ఫీజు రీయింబర్స్మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ భారతీయ జనతా యువమోర్చా బి జె వై ఎం రాజన్న సిరిసిల్ల జిల్లా అధ్యక్షులు రాగుల రాజారెడ్డి అధ్యక్షతన జిల్లా వ్యాప్తంగా ఆందోళన కార్యక్రమాలు చేపట్టారు. ఇందులో భాగంగా సిరిసిల్ల పట్టణంలోని పలు ఇంటర్ మరియు డిగ్రీ కళాశాలల్లో విద్యార్థులతో సంతకాల సేకరణ చేపట్టడంతో పాటు మిస్డ్ కాల్ ద్వారా విద్యార్థుల మద్దతు రిజిస్ట్రేషన్ ప్రక్రియను నిర్వహించారు.ఈ సందర్భంగా బిజెవైఎమ్ జిల్లా అధ్యక్షులు రాగుల రాజారెడ్డి, నాయకులు విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూబకాయిలు వెంటనే చెల్లించాలి. గత ప్రభుత్వం నుంచి రావలసిన ఫీజు రీయింబర్స్మెంట్, స్కాలర్‌షిప్‌లు అందక విద్యార్థులు, వారి కుటుంబాలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నాయని, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే ఆ బకాయిలను విడుదల చేయాలని డిమాండ్ చేశారు.పోరాటంలో విద్యార్థుల భాగస్వామ్యం విద్యార్థుల హక్కుల సాధన కోసం చేపడుతున్న "ఫీజుల బకాయి – బిజెపి లడాయి" కార్యక్రమంలో ప్రతి ఒక్కరినీ భాగస్వాములను చేసేందుకు కళాశాలల వారీగా సంతకాల సేకరణ, క్యూఆర్ కోడ్ మరియు మిస్డ్ కాల్ రిజిస్ట్రేషన్లు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.ప్రభుత్వం స్పందించి విద్యార్థుల పెండింగ్ బకాయిలను విడుదల చేయకపోతే రాబోయే రోజుల్లో ఆందోళనలను మరింత తీవ్రతరం చేస్తామని ప్రభుత్వం మరియు స్థానిక ప్రజాప్రతినిధులను హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో వంగ అనిల్ కార్యక్రమ అసెంబ్లీ కో కన్వీనర్, జిల్లా నాయకులు కాసుగంటి రాజు బిజెపి జిల్లా మీడియా కన్వీనర్, చిందం నరేష్ బీజేవైఎం జిల్లా సెక్రెటరీ, మెహర్ కృష్ణ బీజేవైఎం జిల్లా సోషల్ మీడియా కన్వీనర్, తిరుపతి రెడ్డి, సందీప్, సాయి దీప్, హరీష్, శ్రీధర్,ప్రశాంత్, అభి, మహేష్,వేణు,కిట్టు,కృష్ణ, కళాశాలల ప్రతినిధులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# ఆపదలో ఆదుకున్న ఆటోమొబైల్ అసోసియేషన్

**– అరవింద్ కుటుంబానికి అండగా తార్నాక టూవీలర్ మెకానిక్‌లు**

**– రూ.55 వేల ఆర్థిక సాయం.. రెండు నెలల రేషన్ అందజేత**





**తార్నాక( ప్రశ్న న్యూస్)** కష్టకాలంలో అండగా నిలవడమే నిజమైన మానవత్వానికి నిదర్శనమని నిరూపించారు తార్నాక టూవీలర్ మెకానిక్ ఆటోమొబైల్స్ అసోసియేషన్ సభ్యులు. గత నెల 20వ తేదీన జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన అరవింద్ కుటుంబాన్ని ఆదుకునేందుకు అసోసియేషన్ సభ్యులు ముందుకు వచ్చారు. ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్న అరవింద్ తల్లికి తమ వంతు సహాయాన్ని అందించి కుటుంబానికి మనోధైర్యం కల్పించారు.అరవింద్ మృతితో కుటుంబం పెద్ద దిక్కును కోల్పోయిన పరిస్థితిని గుర్తించిన తార్నాక టూవీలర్ అసోసియేషన్ సభ్యులు, హెచ్ఎంఆర్ అసోసియేషన్ సహకారంతో ఆ కుటుంబానికి అండగా నిలిచారు. రూ.55 వేల ఆర్థిక సాయంతో పాటు రెండు నెలలకు సరిపడా రేషన్‌ను అరవింద్ కుటుంబ సభ్యులకు అందజేశారు.హెచ్ఎంఆర్ అసోసియేషన్ అధ్యక్షులు అశోక్ కుమార్, తార్నాక టూవీలర్ అసోసియేషన్ అధ్యక్షులు నర్సింగరావు, వైస్ ప్రెసిడెంట్ యూసుఫ్ బై చేతుల మీదుగా ఈ సహాయాన్ని అరవింద్ కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా వారు కుటుంబ సభ్యులను పరామర్శించి, జరిగిన విషాదం పట్ల సానుభూతి వ్యక్తం చేశారు.కేవలం వ్యాపార సంబంధాలకే పరిమితం కాకుండా తోటి మెకానిక్ కుటుంబానికి కష్ట సమయంలో అండగా నిలవడం అభినందనీయమని పలువురు పేర్కొన్నారు. సాటి కార్మికుడి కుటుంబం కన్నీటిలో ఉన్నప్పుడు పట్టించుకోకుండా పక్కకు తప్పుకోవడం కాదు.. ఆ కన్నీటిని తుడవడానికి ముందుకు రావడమే నిజమైన సంఘీభావమని అసోసియేషన్ సభ్యులు చాటి చెప్పారు.కార్యక్రమంలో అసోసియేషన్ జనరల్ సెక్రెటరీ భీమ్ రెడ్డి, ట్రెజరర్ శంకర్, లక్ష్మణ్‌తో పాటు తార్నాక టూవీలర్ అసోసియేషన్‌కు చెందిన పలువురు సభ్యులు పాల్గొన్నారు. అరవింద్ కుటుంబ సభ్యులకు భవిష్యత్తులోనూ తమ వంతు సహాయ సహకారాలు అందిస్తామని వారు భరోసా కల్పించారు.ఆపదలో ఆదుకున్న చేతులు.. అరవింద్ కుటుంబానికి కొండంత అండగా నిలిచాయి. మెకానిక్‌ల మధ్య ఉన్న ఐక్యత, మానవత్వం, పరస్పర సహకారానికి ఈ కార్యక్రమం నిదర్శనంగా నిలిచింది.

## నర్సింగ్ గ్రామ సర్పంచ్ దారపోయినా

# మల్లేశంను పరామర్శించిన

**– బీఆర్ఎస్ జిల్లా నాయకుడు కంఠరెడ్డి తిరుపతిరెడ్డి**



**మెదక్ ప్రతినిధి (ప్రశ్న న్యూస్ )** పాపన్నపేట మండలం నర్సింగ్ గ్రామ సర్పంచ్ దారపోయిన మల్లేశం తల్లి దుర్గమ్మ ఇటీవల మృతి చెందగా, గురువారం నిర్వహించిన దశదిన కర్మ కార్యక్రమంలో బీఆర్ఎస్ జిల్లా నాయకులు కంఠరెడ్డి. తిరుపతిరెడ్డి పాల్గొన్నారు. దుర్గమ్మ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించిన ఆయన, మల్లేశం కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేస్తూ మనోధైర్యాన్ని కల్పించారు.అనంతరం గ్రామానికి చెందిన చిన్న నాగేష్ కుటుంబాన్ని పరామర్శించి ధైర్యం చెప్పారు. అలాగే ఇటీవల మృతి చెందిన నీలగిరి పోచమ్మ కుటుంబ సభ్యులను కలిసి సానుభూతి తెలియజేసి, ఈ విషాదాన్ని తట్టుకునే ధైర్యాన్ని దేవుడు ప్రసాదించాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో పాపన్నపేట్ మండల పార్టీ అధ్యక్షులు గంగుల. విష్ణువర్ధన్ రెడ్డి, రైతు సమన్వయ జిల్లా మాజీ అధ్యక్షులు తాడేపు.సోములు, ఏడుపాయల మాజీ దేవస్థానం చైర్మన్ సాతెలి బాలగౌడ్, బాచారం సంఘ పవిత్ర దుర్గయ్య,రామతీర్థం సర్పంచ్ కయ్యం సాయిరెడ్డి, మాజీ సర్పంచ్ గురుమూర్తి గౌడ్, బాబా గౌడ్,కొత్త శ్రీనివాస్,పాపన్నపేట పీఏసీఎస్ చైర్మన్ గునిశెట్టి మల్లేశం,ఎంపీటీసీల ఫోరం మాజీ అధ్యక్షుడు కుబేరుడు, మెదక్ మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ కసిరెడ్డి మాణిక్యరెడ్డి, అరికెల మాజీ సర్పంచ్ చిట్యాల రవీందర్, అరికెల మాజీ ఉపసర్పంచ్ తమ్మయ్యపల్లి అనిల్ రెడ్డి, నాయకులు చిన్న చంద్రయ్య, నీలగిరి కిష్టయ్య, ఏడుపాయల మాజీ డైరెక్టర్ ఉప్పరి పెంటయ్య, నర్సింగ్ గ్రామ పెద్దలు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# కేంద్ర విధానాలను ఎండగడుతూ యువజన కాంగ్రెస్ పోరుబాట

**– బోడుప్పల్ సర్కిల్‌లో బొమ్మక్ అజయ్ ఆధ్వర్యంలో స్టిక్కర్ ప్రచారం**





బోడుప్పల్ (ప్రశ్న న్యూస్) మేడ్చల్--మల్కాజ్‌గిరి జిల్లా యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు బొమ్మక్ అజయ్ ఆధ్వర్యంలో బోడుప్పల్ సర్కిల్‌లో కేంద్ర ప్రభుత్వ విధానాలను నిరసిస్తూ స్టిక్కర్ ప్రచార కార్యక్రమాన్ని నిర్వహించారు. మోదీ--షా ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజల్లోకి తీసుకెళ్లే ఉద్దేశంతో శాంతియుతంగా ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు ఆయన తెలిపారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ప్రజాస్వామ్య విలువలు, రాజ్యాంగ స్ఫూర్తిని పరిరక్షించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు.యువత, విద్యార్థులు,సామాన్య ప్రజల సమస్యలపై కేంద్ర ప్రభుత్వం జవాబుదారీతనంతో వ్యవహరించాలని డిమాండ్ చేశారు.ప్రజల గొంతుకను అణచివేయడం సాధ్యం కాదని,ప్రజా సమస్యలపై యువజన కాంగ్రెస్ నిరంతరం ప్రజల పక్షాన పోరాడుతుందని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో తెలంగాణ యువజన కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు అజ్జు,చంద్రిక,మేడ్చల్ అసెంబ్లీ యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు తోటకూర రాహుల్ యాదవ్,బోడుప్పల్ డివిజన్ అధ్యక్షులు బద్దుల శ్రీకాంత్,అర్జున్ రెడ్డి,రాపోలు పవన్, రాపోలు రాము తదితరులతో పాటు జిల్లా వ్యాప్తంగా యువజన కాంగ్రెస్ నాయకులు,కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ప్రొఫెసర్ కొత్తపల్లి జయశంకర్ ఆశయాలను

# భావితరాలకు చాటాలి

**– నర్సాపూర్ తాసిల్దార్ శ్రీనివాస్**



మెదక్ ప్రతినిధి (ప్రశ్న న్యూస్) ప్రొఫెసర్ కొత్తపల్లి జయశంకర్ ఆశయాలను భావితరాలకు చాటాలని నర్సాపూర్ తాసిల్దార్ శ్రీనివాస్ అన్నారు.గురువారం నాడు స్థానిక తహసిల్దార్ కార్యాలయంలో ప్రొఫెసర్ కొత్తపల్లి జయశంకర్ 92వ జయంతి సందర్భంగా ప్రొఫెసర్ కొత్తపల్లి జయశంకర్ చిత్రపటానికి జ్యోతి ప్రజ్వలన గావించి, పూలమాలలు సమర్పించి, ఘనంగా నివాళులర్పించారు తాసిల్దార్ శ్రీనివాస్ ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ. తెలంగాణ ఉద్యమ సిద్ధాంతకర్త, మేధావి ప్రొఫెసర్ కొత్తపల్లి జయశంకర్ రాష్ట్ర సాధన కోసం జీవితాంతం చేసిన సేవలు చిరస్మరణీయమని పేర్కొన్నారు. జయశంకర్ ఆశయాలు, భావజాలం నేటితరానికిస్ఫూర్తిదాయకమని తెలిపారు.అదే విధంగా, అధికారులు అందరూ హాజరై, జయశంకర్ చిత్రపటానికి పూలమాలలు వేసి, ఘనంగా నివాళులు సమర్పించారు.ఈ కార్యక్రమంలో డిప్యూటీ తాసిల్దార్ స్వప్న, ఆర్ ఐ ప్రభాకర్, ఆర్ ఐ సిద్ధ రాములు, జీపీఓ దుర్గేష్ కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# వాతావరణ మార్పులకు చెక్..

**కూరగాయల రైతులకు శాస్త్రవేత్తల ప్రత్యేక శిక్షణ**

**– ములుగులో ఆధునిక సాగు సాంకేతికతలపై అవగాహన**

**– క్షేత్రస్థాయిలో ప్రత్యక్ష ప్రదర్శన**



**గజ్వేల్ ( ప్రశ్న న్యూస్ )** ములుగు, వాతావరణ మార్పుల సవాళ్లను అధిగమించి తక్కువ ఖర్చుతో అధిక దిగుబడులు సాధించే ఆధునిక కూరగాయల సాగు పద్ధతులపై ముల్కనూరు ప్రాంత రైతులకు ప్రత్యేక శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. శ్రీ కొండా లక్ష్మణ్ తెలంగాణ ఉద్యాన విశ్వవిద్యాలయం, ములుగు--సిద్ధిపేటలోని పోస్ట్ గ్రాడ్యుయేట్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ హార్టికల్చరల్ సైన్సెస్ ఆధ్వర్యంలో, ముల్కనూరు కో-ఆపరేటివ్ రూరల్ క్రెడిట్ అండ్ మార్కెటింగ్ సొసైటీ లిమిటెడ్ సహకారంతో జరిగిన ఈ కార్యక్రమానికి రైతుల నుంచి విశేష స్పందన లభించింది.కార్యక్రమాన్ని ప్రొఫెసర్ డా. వి. సుచిత్ర ప్రారంభించి, వాతావరణ మార్పుల నేపథ్యంలో రైతులు అనుసరించాల్సిన శాస్త్రీయ సాగు విధానాల ప్రాముఖ్యతను వివరించారు. అనంతరం శాస్త్రవేత్తలు కూరగాయల అంటుకట్టడం, నాణ్యమైన నారుమడి తయారీ, కోత అనంతర నిర్వహణ, పురుగులు--తెగుళ్ల గుర్తింపు, సమగ్ర నివారణ చర్యలు వంటి అంశాలపై సమగ్ర శిక్షణ అందించారు.వెజిటబుల్ రీసెర్చ్ స్టేషన్, రాజేంద్రనగర్‌కు చెందిన శాస్త్రవేత్త డా. జె. శ్రీనివాస్ ఎల్‌నినో పరిస్థితుల్లో వాతావరణ అనుకూల కూరగాయల సాగు పద్ధతులను వివరించారు. "మారుతున్న వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా సాగు పద్ధతులు మార్చుకుంటేనే రైతులు అధిక దిగుబడులు, మెరుగైన ఆదాయం సాధించగలరు" అని శాస్త్రవేత్తలు సూచించారు.శిక్షణ ద్వారా ఆధునిక సాంకేతికతలపై విలువైన అవగాహన లభించిందని రైతులు పేర్కొంటూ, ఇలాంటి కార్యక్రమాలు మరిన్ని నిర్వహించాలని కోరారు. విశ్వవిద్యాలయం, శాస్త్రవేత్తలు, నిర్వాహకులకు వారు కృతజ్ఞతలు తెలిపారు.

# ప్రజా యుద్ధనౌక గద్దర్‌కు ఘన నివాళులు


**– గజ్వేల్‌లో ఆట--పాట--మాటలతో మూడో వర్ధంతి కార్యక్రమం**



**గజ్వేల్ ( ప్రశ్న న్యూస్ )** ప్రజా గాయకుడు, విప్లవ గీత రచయిత, ప్రజా యుద్ధనౌక గద్దర్ మూడో వర్ధంతి సందర్భంగా గజ్వేల్ పట్టణ కేంద్రంలో తెలంగాణ సాంస్కృతిక సారథి గజ్వేల్ కళాబృందం ఆధ్వర్యంలో ఘన నివాళుల కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా కవులు, కళాకారులు పెద్ద ఎత్తున పాల్గొని గద్దర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన ఆలపించిన విప్లవ గీతాలను ఆలపిస్తూ ఆట, పాట, మాటలతో ఆయన సేవలను స్మరించుకున్నారు.వక్తలు మాట్లాడుతూ గద్దర్ గజ్వేల్ నియోజకవర్గానికి చెందిన గొప్ప ప్రజాకళాకారుడని, తెలంగాణ రాష్ట్ర సాధన కోసం తన పాటలతో ప్రజలను చైతన్యపరిచిన మహోన్నత వ్యక్తిగా నిలిచారని కొనియాడారు. "మా భూములు మాకే", "నీళ్లు--నిధులు--నియామకాలు" వంటి అంశాలపై ఆయన ప్రజల్లో చైతన్యం నింపారని గుర్తు చేశారు. గద్దర్ ఆశయాలను, ఆయన పాటలను భావితరాలకు చేరవేయడం తమ బాధ్యత అని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో తెలంగాణ సాంస్కృతిక సారథి గజ్వేల్ టీమ్ లీడర్ పిల్లిట్ల శ్యామ్‌సుందర్, సనువాల కనకయ్య, ప్రధాన కార్యదర్శి సిద్ధులు, కవి--గాయకులు పిన్నింటి రత్నం, గెంటే హరిప్రసాద్, శ్రీనివాస్, బండారు నరసింహులు, చెదిరి పద్మ, సల్ల మమత, దిలాల్‌పూర్ నాగరాజుతో పాటు పలువురు కళాకారులు, కవులు, గాయకులు పాల్గొని గద్దర్‌కు ఘనంగా నివాళులర్పించారు.

# శ్రీగిరిపల్లిలో తల్లిపాలు వారోత్సవాలు

**– గర్భిణులు, బాలింతలకు అవగాహన కల్పించిన హంస హోమియోపతి మెడికల్ కాలేజ్ విద్యార్థులు**



**గజ్వేల్ ( ప్రశ్న న్యూస్ )** సిద్దిపేట జిల్లా గజ్వేల్ మండలం శ్రీగిరిపల్లి గ్రామంలో హంస హోమియోపతి మెడికల్ కాలేజ్, ఐసీపీఎస్ ఆధ్వర్యంలో గురువారం తల్లిపాలు వారోత్సవాలను నిర్వహించారు.ఈ సందర్భంగా హంస హోమియోపతి మెడికల్ కాలేజ్ విద్యార్థులు స్కిట్ ప్రదర్శించి, తల్లిపాల ప్రాముఖ్యత, శిశువుకు సరైన విధంగా తల్లిపాలు ఇవ్వాల్సిన పద్ధతి, గర్భిణులు మరియు బాలింతలు తీసుకోవాల్సిన పోషకాహారం గురించి అవగాహన కల్పించారు.అంగన్‌వాడీ సూపర్వైజర్ సౌజన్య మాట్లాడుతూ తల్లిపాలు ఇవ్వడం వల్ల తల్లికి, శిశువుకు కలిగే ఆరోగ్య ప్రయోజనాలను వివరించారు. పుట్టిన వెంటనే శిశువుకు తల్లిపాలు అందించడం ద్వారా రోగనిరోధక శక్తి పెరగడంతో పాటు ఆరోగ్యకరమైన ఎదుగుదలకు దోహదపడుతుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ కల్పన, గ్రామ కార్యదర్శి వేణు, 8వ వార్డు సభ్యుడు వెంకట్ ముదిరాజ్, జీపీఓ అనిత, అంగన్‌వాడీ టీచర్లు నిర్మల, పద్మజ, రమ, ఆశా కార్యకర్తలు, ఆయాలు, గర్భిణులు, బాలింతలు పాల్గొన్నారు.హంస హోమియోపతి మెడికల్ కాలేజ్ నుంచి డాక్టర్ ఆశ, సంగీతతో పాటు విద్యార్థులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# నూలుపోగులో నాగరికత చేనేతకుచేయూతే

# నిజమైన గౌరవం

## - ఆగస్టు 7 జాతీయ చేనేత దినోత్సవం ప్రత్యేక కథనం - చేనేత అనేది కేవలం ఒక వృత్తి కాదు

**భారతీయ సంస్కృతికి అద్దం పట్టే జీవన విధానం. ప్రతి నూలు పోగులో ఓ కుటుంబం శ్రమ దాగి ఉంటుంది. ప్రతి చీరలో ఓ నేతన్న చెమట పరిమళిస్తుంది. యంత్రాల హోరులోనూ, మార్కెట్ పోటీలోనూ, మారుతున్న ఫ్యాషన్ ధోరణుల మధ్య ఇప్పటికీ చేనేత తన ప్రత్యేకతను నిలబెట్టుకోవడం వెనుక వేలాది మంది నేతన్నల అంకితభావం ఉంది**

**(వెంకట్-- ప్రశ్న న్యూస్ ఏపీ బ్యూరో)**







ప్రతి సంవత్సరం ఆగస్టు 7న దేశవ్యాప్తంగా జాతీయ చేనేత దినోత్సవం జరుపుకుంటారు. 1905లో స్వదేశీ ఉద్యమానికి శ్రీకారం చుట్టిన చారిత్రక దినాన్ని గుర్తు చేసుకుంటూ కేంద్ర ప్రభుత్వం ఈ దినోత్సవాన్ని నిర్వహిస్తోంది. విదేశీ వస్త్రాలను బహిష్కరించి స్వదేశీ వస్త్రాలకు ప్రాధాన్యం ఇవ్వాలనే సందేశాన్ని నేటి తరానికి గుర్తుచేస్తోంది. ఆంధ్రప్రదేశ్‌తో పాటు తెలంగాణలోనూ చేనేతకు సుదీర్ఘ చరిత్ర ఉంది. మంగళగిరి, ఉప్పాడ, ధర్మవరం, వెంకటగిరి, పోచంపల్లి వంటి ప్రాంతాల చేనేత వస్త్రాలు దేశ విదేశాల్లో ప్రత్యేక గుర్తింపు సంపాదించాయి. ఒక్కో ప్రాంతానికి ఒక్కో ప్రత్యేక అల్లిక, రంగుల కలయిక, నాణ్యత ప్రపంచ మార్కెట్‌లోనూ ఆదరణ పొందుతోంది. ఇవి కేవలం వస్త్రాలు కాదు. భారతీయ కళా సంపదకు చిరునామాలు. అయితే చేనేత రంగం నేడు ఎన్నో సవాళ్లను ఎదుర్కొంటోంది.

పవర్‌లూమ్‌ల పెరుగుదల, యంత్రాలతో భారీ ఉత్పత్తి, తక్కువ ధరలకు వస్త్రాల లభ్యత, ముడి సరుకుల ధరల పెరుగుదల, సరైన మార్కెటింగ్ లేకపోవడం వంటి కారణాలతో నేతన్నల జీవితం కష్టాల్లో పడుతోంది. ఎన్నో కుటుంబాలు తరతరాలుగా కొనసాగించిన వృత్తిని విడిచి ఇతర పనుల వైపు వెళ్లాల్సిన పరిస్థితులు ఏర్పడుతున్నాయి.ఒక చేనేత చీర నేయడానికి రోజులు పడుతుంది. అందులో కనిపించే ప్రతి అల్లిక వెనుక ఓ కళాకారుడి నైపుణ్యం ఉంటుంది. యంత్రంతో తయారయ్యే వస్త్రం కంటే చేనేత వస్త్రం ధర ఎక్కువగా కనిపించినా, దాని వెనుక ఉన్న శ్రమను గుర్తిస్తే ఆ విలువ చిన్నదే. చేనేత కొనడం అంటే కేవలం వస్త్రం కొనడం కాదు.ఒక కుటుంబానికి ఉపాధి కల్పించడం.ప్రభుత్వాలు కూడా చేనేత రంగాన్ని ప్రోత్సహించేందుకు అనేక పథకాలు అమలు చేస్తున్నాయి. నేతన్నలకు రుణాలు, సబ్సిడీలు, మార్కెటింగ్ సదుపాయాలు, ఎగుమతులకు ప్రోత్సాహం, డిజిటల్ విక్రయ వేదికలు, డిజైన్ అభివృద్ధి వంటి చర్యలు చేపడుతున్నాయి. అయినప్పటికీ, ఈ రంగం నిలదొక్కుకోవాలంటే ప్రభుత్వ సహకారంతో పాటు ప్రజల భాగస్వామ్యం కూడా అవసరం.నేటి యువతలో చేనేత వస్త్రాల వినియోగం పెరుగుతోంది. సంప్రదాయ దుస్తులను ఆధునిక డిజైన్లతో మేళవిస్తూ ఫ్యాషన్ ప్రపంచంలో చేనేతకు కొత్త గుర్తింపు లభిస్తోంది. వివాహాలు, పండుగలు, ప్రభుత్వ కార్యక్రమాలు, సాంస్కృతిక వేడుకల్లో చేనేత వస్త్రాలకు ప్రాధాన్యం పెరగడం శుభపరిణామం. అంతర్జాతీయ వేదికలపై కూడా భారతీయ చేనేత తన ప్రత్యేకతను చాటుతోంది.పర్యావరణ పరిరక్షణలో కూడా చేనేత కీలక పాత్ర పోషిస్తోంది. యంత్రాల వినియోగం తక్కువగా ఉండటం, విద్యుత్ వినియోగం తగ్గడం, సహజ రంగులకు ప్రాధాన్యం ఇవ్వడం వల్ల చేనేత పర్యావరణహిత పరిశ్రమగా గుర్తింపు పొందింది. ప్రపంచం మొత్తం సుస్థిర అభివృద్ధి వైపు అడుగులు వేస్తున్న ఈ తరుణంలో చేనేతకు మరింత ఆదరణ లభించే అవకాశం ఉంది.చేనేతను కాపాడటం అంటే కేవలం ఒక వృత్తిని కాపాడటం కాదు. భారతీయ సంస్కృతిని, గ్రామీణ ఆర్థిక వ్యవస్థను, లక్షలాది కుటుంబాల జీవితాలను కాపాడటం. ప్రతి పండుగకు కనీసం ఒక చేనేత వస్త్రాన్ని కొనుగోలు చేయాలనే సంకల్పం ప్రతి కుటుంబంలో పెరిగితే నేతన్నల జీవితాల్లో వెలుగులు నిండతాయి. ప్రభుత్వ కార్యాలయాలు, విద్యాసంస్థలు, ప్రజాప్రతినిధులు, ఉద్యోగులు చేనేత వస్త్రాల వినియోగాన్ని అలవాటు చేసుకుంటే ఈ రంగానికి కొత్త ఊపిరి లభిస్తుంది.చేనేతకు గౌరవం ఇవ్వడం అంటే శ్రమకు గౌరవం ఇవ్వడమే. నేతన్న చేతిలో తిరిగే మగ్గం కేవలం నూలును మాత్రమే కాదు. మన సంస్కృతిని, సంప్రదాయాన్ని, ఆత్మగౌరవాన్ని అల్లుతోంది.

ఆ మగ్గం శబ్దం ఎప్పటికీ ఆగిపోకుండా ఉండాలంటే సమాజం మొత్తం చేనేతకు అండగా నిలవాల్సిన అవసరం ఉంది.ఈ జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా ప్రతి ఒక్కరూ ఒక చేనేత వస్త్రాన్ని కొనుగోలు చేయడం ద్వారా నేతన్న కుటుంబానికి చేయూతనివ్వాలి. నూలుపోగులో నిక్షిప్తమైన శ్రమకు, కళకు, సంప్రదాయానికి మన వంతు గౌరవం అందించాలి. చేనేత బతికితేనే గ్రామీణ భారతం బలపడుతుంది. నేతన్న నవ్వితేనే మన సంస్కృతి చిరస్థాయిగా వెలుగొందుతుంది.చేనేతకు చేయూత దేశీయతకు నిజమైన నివాళి.

# రియల్ మోసం

## అనుమతులు లేకుండా ఎస్సార్ వెంచర్స్ ఎస్ ఆర్ పేరిట వెంచర్ ఏర్పాటు

### - అమాయక ప్రజల ను మోసం - మేడ్చల్ పోలీసులను ఆశ్రయించిన బాధితులు



**మేడ్చల్(ప్రశ్న న్యూస్)** ఇది సరికొత్త రియల్ మోసం. ఎలాంటి అనుమతులు లేకుండా వెంచర్ వేయడమే కాకుండా.. కాళేశ్వరం కాలువలో ఈ వెంచర్ పోతుందని తెలిసి అమాయక ప్రజలకు ఫ్లాట్ లను అంటగట్టి కోట్లు దండుకున్న వెంచర్ యజమాని కల్లూరి సుభాష్ రెడ్డి మోసమిది. దీనిపై బాధితులు మేడ్చల్ పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేశారు. రూపాయి రూపాయి కూడా పెట్టి భూమి తీసుకొని సొంత ఇల్లు కట్టుకుందాం అనుకున్న వారిని నిలువునా ముంచాడు. లక్షల రూపాయలు వెచ్చించి కొనుక్కున్న భూమి కాళేశ్వరం ప్రాజెక్టులో పోతుందన్న విషయం తెలుసుకున్న బాధితులు లబో దిబోమంటూ పోలీసులను ఆశ్రయించారు.

### వివరాలు ఇలా ఉన్నాయి

మేడ్చల్ మండలం రావల్ కోల్ అనుబంధ గ్రామం గూడెం గడ్డ తండాలో ఎలాంటి అనుమతులు లేకుండా ఎస్ సర్ వెంచర్ పేరిట వెంచర్ ను ఏర్పాటు చేశారు. అంతేకాకుండా ఈ వెంచర్ కాళేశ్వర్ కాలువలో పోతుంది అన్న సమాచారం మేరకు సదరు యజమాని హడావుడిగా బాధితులకు ప్లాట్ లను అమ్మాడని బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. 2019లో కాళేశ్వరం కాలువ కోసం వెంచర్ స్వాధీనం కోసం ప్రభుత్వ ప్రకటన సైతం చేసింది. ఈ విషయం తెలిసిన వెంచర్ యజమాని కల్లూరి సుభాష్ రెడ్డి 20 20 లో హడావుడిగా 11 ప్లాట్లను అమ్మినట్లు బాధితులు ఆరోపిస్తున్నారు. ఈ వెంచర్లు ప్లాట్లు కొనుగోలు చేసిన వారిలో సగం కి పైగా ప్లాట్లు కాళేశ్వరం కాలువలో పోయాయని వాపోతున్నారు. తమకు న్యాయం చేయాలని బాధితులు వెంచర్ యజమాని సుభాష్ రెడ్డిని నిలదీయగా అదే ప్రాంతంలో మరో వెంచర్ వేసి ప్లాట్లు ఇస్తానని హామీ ఇచ్చారని తెలిపారు. 20 20 నుండి గత ఆరు సంవత్సరాలుగా ఇవాళ, రేపు అని కాలం వెలదీస్తున్నాడని బాధితులు ఆరోపించారు. ఓపిక నశించి మేడ్చల్ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశామని, తమకు న్యాయం జరిగేలా చూడాలని బాధితులు కోరుతున్నారు.





### కేసు నమోదు చేశాం : సిఐ అంజిరెడ్డి

బాధితుల ఫిర్యాదు మేరకు ఎస్ ఆర్ వెంచర్ యజమాని కల్లూరి సుభాష్ రెడ్డి పై కేసు నమోదు చేశామని మేడ్చల్ సిఎస్ అంజిరెడ్డి తెలిపారు.

ఈ విషయంపై మనం దినపత్రిక ప్రతినిధి అడిగిన వివరణకు సీఐ అంజి రెడ్డి మాట్లాడుతూ తాను ఇటీవల బదిలీపై ఇక్కడికి వచ్చానని గతంలోనే వెంచర్ యజమాని కల్లూరి సుభాష్ రెడ్డి పై ఫిర్యాదు చేశారని తెలిపారు.అప్పటికి బాధితుల ఫిర్యాదు మేరకు వెంచర్ యజమాని కల్లూరి సుభాష్ రెడ్డిని పిలిపించి మాట్లాడనని తెలిపారు. కాళేశ్వరం కాలువలో ఈ వెంచర్ కు చెందిన 11 ప్లాట్లో పోయిన విషయం వాస్తవమేనని అయితే వెంచర్ యజమాని కల్లూరి సుభాష్ రెడ్డి మాత్రం బాధితులకు ప్రభుత్వ రేటు ప్రకారం బాధితులకు బాధితులకు అందజేస్తాం అని పేర్కొన్నారని ఎందుకు బాధితులు ఒప్పుకోకపోవడంతో సుభాష్ రెడ్డి పై కేసు నమోదు చేశామని పేర్కొన్నారు.

# రిజర్వేషన్లపై భగవత్ కీలక వ్యాఖ్యలు

### - లబ్ధి పొందిన వారికి ప్రత్యేక సూచన




**ముంబై (ప్రశ్న న్యూస్)** రిజర్వేషన్లపై ఆర్ఎస్ఎస్ చీఫ్ మోహన్ భగవత్ కీలక వ్యాఖ్యలు చేశారు. సమాజంలో అసమానతలు ఉన్నంత కాలం రిజర్వేషన్లు కొనసాగాల్సిందేనని స్పష్టం చేశారు. అయితే వాటి వల్ల ఇప్పటికే సామాజికంగా, ఆర్థికంగా ఎదిగిన వారు స్వచ్ఛందంగా ఆ ప్రయోజనాలను వదులుకోవాలని సూచించారు. ముంబైలోని నీతా ముఖేష్ అంబానీ కల్చరల్ సెంటర్‌లో నిర్వహించిన కార్యక్రమంలో యువత అడిగిన ప్రశ్నలకు భగవత్ సమాధానాలు ఇచ్చారు. విద్య, ఉద్యోగాల్లో రిజర్వేషన్లు ఎంతకాలం కొనసాగాలనే ప్రశ్నకు ఆయన స్పందిస్తూ ఈ అంశాన్ని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ దృక్పథంలో చూడాలని అన్నారు. రిజర్వేషన్లు రాజకీయ కారణాలతో కాకుండా సామాజిక కారణాలతో అమల్లోకి వచ్చాయని భగవత్ చెప్పారు. సమాజంలో వివక్ష ఉన్నంత కాలం వాటి అవసరం ఉంటుందని తెలిపారు. సంక్షేమ చర్యలు నిజాయతీగా అమలు చేసి సామాజిక అసమానతలు తొలగించిన రోజే రిజర్వేషన్ల అవసరం కూడా తగ్గుతుందని అభిప్రాయపడ్డారు. రిజర్వేషన్ల ద్వారా ఇప్పటికే ఎదిగిన వారు తమ సమాజంలోని ఇంకా వెనుకబడిన వారికి అవకాశం కల్పించేలా కోటాను వదులుకోవాలనే ఆలోచనతో ముందుకు రావాలని పిలుపునిచ్చారు. అలాంటి ఆలోచన ఇప్పటికే కొందరిలో కనిపిస్తోందని చెప్పారు. అలాంటి భావనను ప్రోత్సహించాలని సూచించారు. రిజర్వేషన్ల అమలును రాజకీయాలకు అతీతంగా చూడాలని భగవత్ అన్నారు. రాజకీయ ప్రయోజనాల కోసం ఈ అంశాన్ని వాడుకోవడం వల్ల సమాజంలో విభేదాలు పెరుగుతున్నాయని వ్యాఖ్యానించారు. వాస్తవానికి సామాజిక ఐక్యత కోసం తీసుకొచ్చిన వ్యవస్థను తప్పుదోవ పట్టిస్తున్నారని చెప్పారు. ఇటీవల పలు రాష్ట్రాల్లో రిజర్వేషన్లపై చర్చ మళ్లీ మొదలైన వేళ భగవత్ చేసిన వ్యాఖ్యలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి.

# ఇంటింటికీ తెలుగుదేశం కార్యక్రమం 11వ రోజూ విజయవంతం

### - 30.38 లక్షల ఇళ్లను సందర్శించిన టీడీపీ శ్రేణులు



అమరావతి (ప్రశ్న న్యూస్) కూటమి ప్రభుత్వం రెండేళ్ల పాలనలో రాష్ట్రం సాధించిన అభివృద్ధిని, అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లేందుకు తెలుగుదేశం పార్టీ ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన 'ఇంటింటికి తెలుగుదేశం - 2 ఏళ్ల నమ్మకం - అభివృద్ధి, సంక్షేమం" కార్యక్రమం విజయవంతంగా 11వ రోజుకు చేరుకుంది. రాష్ట్రవ్యాప్తంగా టీడీపీ నాయకులు, కార్యకర్తలు ఉత్సాహంగా పాల్గొంటూ ఈ కార్యక్రమాన్ని దిగ్విజయంగా కొనసాగిస్తున్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా 11వ రోజున రాష్ట్రవ్యాప్తంగా 3.40 లక్షల గృహాలను టీడీపీ శ్రేణులు సందర్శించాయి. కార్యక్రమం ప్రారంభమైనప్పటి నుండి ఒకే రోజులో ఇంత పెద్ద సంఖ్యలో ఇళ్లను సందర్శించడం ఇదే ప్రథమం. దీంతో గత 11 రోజుల్లో మొత్తంగా 30.38 లక్షల గృహాలకు చేరుకుని, కూటమి ప్రభుత్వం రెండేళ్ల పాలనలో సాధించిన ప్రగతిని, అందిస్తున్న సంక్షేమ ఫలాలను ప్రజలకు వివరించారు. ముఖ్యంగా ఎన్నికల సమయంలో ఇచ్చిన 'సూపర్ సిక్స్' హామీల అమలు తీరును ప్రతి ఇంటికీ చేరవేశారు.'ఇంటింటికీ తెలుగుదేశం' కార్యక్రమాన్ని పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్, రాష్ట్ర మానవ వనరుల శాఖ మంత్రి నారా లోకేష్ సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగిస్తూ నిరంతరం సమీక్షిస్తున్నారు. రాష్ట్రవ్యాప్తంగా జరుగుతున్న ఇంటింటి సందర్శనలు, పార్టీ శ్రేణుల పనితీరుపై ఆయన ఎప్పటికప్పుడు వివరాలు సేకరిస్తూ క్షేత్రస్థాయి పర్యవేక్షణ కొనసాగిస్తున్నారు. కార్యక్రమంలో ఉత్తమ పనితీరు కనబరుస్తున్న టీడీపీ నాయకులు, కార్యకర్తలను నారా లోకేశ్ అభినందించారు. ఇదే స్ఫూర్తితో మరింత ఉత్సాహంగా కార్యక్రమాన్ని ముందుకు తీసుకెళ్లాలని ఆయన సూచించారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని సమర్థంగా వినియోగిస్తూ "ఇంటింటికీ తెలుగుదేశం" కార్యక్రమాన్ని మరింత పటిష్ఠంగా అమలు చేసేందుకు లోకేశ్ ప్రత్యేక చర్యలు చేపట్టారు.

# కొత్త ఉద్యమానికి కాక్రోచ్ పార్టీ శ్రీకారం

### - దేశవ్యాప్తంగా 'క్యా బోల్తీ పబ్లిక్?'



**న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్)** జంతర్‌మంతర్‌లో నీట్ ప్రశ్నాపత్రం లీక్‌లపై చేపట్టిన ఆందోళనల తర్వాత దేశవ్యాప్తంగా ప్రజల్లోకి వెళ్లాలని కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) నిర్ణయించింది. సెప్టెంబర్ నుంచి 'క్యా బోల్తీ పబ్లిక్?' పేరుతో దేశవ్యాప్త ప్రచార కార్యక్రమం చేపడుతున్నట్లు పార్టీ వ్యవస్థాపకుడు అభిజిత్ దిప్కే ప్రకటించారు. ఛత్రపతి శంభాజీనగర్‌లో జరిగిన రెండు రోజుల జాతీయ కోర్ కమిటీ సమావేశం ముగిసిన తర్వాత దీప్కే మీడియాతో మాట్లాడారు. విద్యార్థులు, యువత, సామాన్య ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను నేరుగా తెలుసుకొని ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లడమే ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని చెప్పారు.దేశంలో విద్య పూర్తిగా వ్యాపారంగా మారిందని దిప్కే విమర్శించారు. మొదటి తరగతి ప్రవేశానికే రూ.లక్షల ఫీజులు, భారీ విరాళాలు వసూలు చేస్తున్నారని ఆరోపించారు. మధ్యతరగతి, ఉద్యోగ కుటుంబాలు పిల్లలను చదివించడం భారంగా మారిందన్నారు. ఉన్నత విద్య, కోచింగ్ పేరుతో తల్లిదండ్రులు అప్పుల పాలవుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వ విద్యాసంస్థలను బలోపేతం చేయాల్సిన అవసరం ఉందని చెప్పారు. విద్య ప్రతి ఒక్కరి హక్కని, అది అందరికీ అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.నీట్ అక్రమాలపై జరిగిన ఆందోళనల్లో నిరుద్యోగ యువత పెద్ద ఎత్తున పాల్గొన్నారని దిప్కే గుర్తుచేశారు. దేశంలో నిరుద్యోగం కూడా అత్యంత కీలక సమస్యగా మారిందన్నారు. న్యాయవ్యవస్థ, ఎన్నికల సంఘంపై ప్రజల్లో విశ్వాసం దెబ్బతింటోందని వ్యాఖ్యానించారు. అధికారాన్ని ప్రశ్నించే స్వతంత్ర పాత్రను మీడియా పోషించాలని కోరారు. సీజేపీ ఎన్నికల్లో పోటీ చేయదని, ప్రజల హక్కుల పరిరక్షణ, పాలనలో సంస్కరణల కోసం ఒత్తిడి తెచ్చే శక్తిగా పనిచేస్తుందని దిప్కే స్పష్టం చేశారు.

Printed, Published & Owned by "Gouti Bala Sai Tilak" and Published at H.no : 12-13-1282, Flat No : 407, Mehtab Arcade, Tarnaka Main Road, Opp.Ganesh Temple, Secunderabad - 500017, Telangana State. Printed at "Gowrish Offset Printers". H.No : 3-4-353, Barkatpura, Hyderabad-500027. Telangana State. Editor : "Vempati Vijay Kumar". "RNI No: TELTEL/2021/80267". Email : prajaprashna@gmail.com. Cell No : 9494055588